ప్రజాశక్తి

సోమవారం 5 మే 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఎండల్లో హాయి...హాయి

అకాల వర్షంతో మారిన వాతావరణం - తాడేపల్లిలో గాలుల బీభత్సం... భారీ వర్షం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆకాల వర్షాలతో ప్రజలకు వేసవి తాపం నుంచి ఉపశమనం కల్గింది. గుంటూరు, పల్నాడు జిల్లాలో ఆదివారం ఒక మోస్తరుగా వర్షం కురిసింది. రాజధాని ప్రాంతంలో కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తాడేపల్లి, మంగళగరిలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవగా తాడికొండ, పెదకాకాని, మేడికొండూరు, ప్రత్తిపాడు, పొన్నూరు, తెనాలి తదితర ప్రాంతాల్లో జల్లులతో కూడిన ఒక మోస్తరు వర్షం కురిసింది. పల్నాడు జిల్లాల్లో పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షం పడింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లబడటంతో ఆహ్లాదకరంగా మారింది. వేసవి తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఆహ్లాదకర వాతావరణంతో ప్రజలు సేదతీరారు. ఎక్కువ ప్రాంతాల్లో రాత్రి వేళ కూడా చల్లదనం కొనసాగింది. గత కొన్ని రోజులుగా వేసవి తాపానికి ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కల్గింది. రాబోయే కొద్ది రోజుల్లో ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతాయన్న సంకేతాల నేపథ్యంలో తుపాను ముందు ప్రశాంతత మాదిరిగా వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా ఆహ్లాదాన్ని ప్రజలు ఆస్వాది స్తున్నారు. ఆకస్మాత్తుగా వచ్చిన ఉరుములు, మెరుపులు, భీకర

2 లో

పెనుగాలులకు నేల వాలిన అరటి

మొదళ్లు కదిలిపోయిన మునగ - రూ.4 కోట్ల పంట నష్టం

ప్రభుత్వం ఆదుకోవాలి - రైతు సంఘం

ప్రజాశక్తి- తాడేపల్లి

శనివారం ఒక్కసారిగా వాతావరణం మార్పులు చోటుచేసుకుని పెద్ద ఎత్తున వీచిన పెనుగా లు లకు రాజధానిలో భాగమైన ఉండవల్లి పెనుమా క గ్రామంలో అరటి, మునగ వేసిన రైతులు నాలుగు కోట్ల రూపాయలు నష్టపోయారు. పెద్ద ఎత్తున వీచిన గాలులకు అరటి చెట్లు మొత్తం నేల వాలాయి. దీంతో అరటి గెలలు కూడా పాడైపోయాయని రైతుల ఆందోళన చెందుతున్నారు. రెండు గ్రామాల్లో కలిపి ఈ సంవత్సరం 700 ఎకరాల్లో రైతులు అరటి పంట సాగు చేశారు. 400 ఎకరాల్లో ఇప్పటికే రైతులు పంటను మార్కెట్‌కు చేర్చి లబ్ధి పొందారు. 300 ఎకరాల రైతులు శనివారం వీచిన పెనుగాలుల వల్ల ఎకరానికి లక్ష రూపాయలు చొప్పున నష్టపోయామని బవురు మన్నారు. 100 ఎకరాలు వేసిన మునగ పంట దెబ్బతింది. మునగ చెట్టు మొదలు కదిలి పక్కకు ఒరిగిపోయాయి.

ఉండవల్లిలో నేలవాలిన అరటి పొలాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఎకరానికి 30 వేల రూపాయలు నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాజధాని డివిజన్ కార్యదర్శి కొ౦్రపోలు జగదీశ్వర్ రెడ్డి కోరారు. ప్రభుత్వం ఆదుకోకపోతే రైతుల మనుగడ కష్టమని చెప్పారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వారిలో ఈశ్వర్ రెడ్డి, బోస్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, రమణ పాల్గొ నారు.

చేబ్రోలు పుల్లయ్య స్కూల్ కేంద్రం వద్ద ధృవపత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది

నీట్ పరీక్ష ప్రశాంతం

- 97.71 శాతం హాజరు

ప్రజాశక్తి-గుంటూరు

వైద్య విద్య ప్రవేశానికి ఆదివారం దేశ వ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) గుంటూరు జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోలేదు. గుంటూరు నగరంలో 14 పరీక్షా కేంద్రాలు, తెనాలి పట్టణంలో 2 పరీక్షా కేంద్రాలు మొత్తం 16 కేంద్రాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పరీక్ష నిర్వహించారు. 4250 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 4153 మంది హాజర య్యారు. 97 మంది గైర్హాజరయ్యారు. 97.71 శాతం హాజరు నమోదు అయ్యింది. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలీసులను ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థిని నిబంధనల ప్రకారం వస్త్రధారణ, ధృవపత్రాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోపలకి అనుమతించారు. పలువురు విద్యార్థినులు

జెకెసి కాలేజి వద్ద కుమార్తెకు జెడ తీసివేస్తున్న ఓ తల్లి

ధరించిన ఆభరణాలను నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రం వెలుపలే తొలగించిన తర్వాతే అనుమతించారు. విద్యార్థినులు జడలు వేసుకోవటాన్ని కూడా అనుమతించ కపోవటంతో వాటిని తొలగించి, లూజ్ హెయిర్‌తో వెళ్లటం కనిపించింది. మధ్యాహ్నం 2 గంటల నుండి ప్రారంభమైన పరీక్షకు విద్యార్థులు 11 గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు

2 లో

మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్

ఎక్కడి సమస్యలు అక్కడే..

వినుకొండ మండలంలో సిపిఎం సర్వే బృందానికి తెలిపిన ప్రజలు

రైతుల వద్ద పొగాకు కొనుగోలు చేయాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం మాటలు నీటి మూటలేనని, ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని పల్నాడు జిల్లా సిపిఎం కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. 2వ తేదీ నుండి 15వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన భూ, ప్రజా సమస్యలు సర్వేలో భాగంగా వినుకొండ మండలంలోని విఠంరాజు పల్లి, బ్రాహ్మణపల్లి, నరగాయపాలెం, నాగిరెడ్డిపల్లి, శివాపురం తదితర గ్రామాల్లో వినుకొండ సిపిఎం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు విజయకుమార్ వినుకొండలో మీడియాతో మాట్లాడారు. నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని అరుంధతి కాలనీ, మా లక్ష్మ కాలనీల్లో ఎస్సీ, ఎస్టీ వాసుల పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం అన్నారు. సుమారు 400 కుటుంబాలకు పైగా దళితుల నివసిస్తున్న కాలనీలో అంగన్వాడి కేంద్రం లేకపోవటం, సుమారు 70 మంది పిల్లల్లో 10 శాతం కూడా పాఠశాలలకు వెళ్లకుండా విద్యుత్ దూరంగా ఉండటం సిగ్గుచేటన్నారు. మహాలక్ష్మ కాలనీలో నివసిస్తున్న ఎస్టీ యానాదుల ఇల్లకు కరెంటు మీటర్లు, వీధిలైట్లు, తాగునీటి పైప లైను మౌలిక వసతులు లేవని, అన్ని పన్నులు మాత్రం వసూలు చేయడం విడ్డూరమన్నారు. ఎస్టి కాలనీ వాసుల అవసరాలు ఆసరాగా

2 లో

గుంటూరు లేడీస్ హాస్టల్‌లో సిసి కెమేరాల కలకలం

పోలీసుల అదుపులో లేడిస్ హాస్టల్ నిర్వహకులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు బ్రాడీపేటలో ఒక లేడిస్ హాస్టల్‌లో రహస్యంగా కెమెరాల ఏర్పాటు చేశారన్న అంశం ఆదివారం కలకలం రేపింది. హాస్టల్‌లో ఉండే ఒక యువతి ఆరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగుచూసింది. హాస్టల్ లో బాత్రూం ముందు కెమెరాలు పెట్టి వీడియోలు చిత్రీకరిస్తున్నారంటూ పోలీసులకి ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి సమయంలో అసభ్యకరంగా మెసేజులు చేయటం అబ్బాయిల్ని తీసుకొని వచ్చి లేడీస్ హాస్టల్లో ఉంచడం చేస్తున్నారంటున్న కూడా వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.దీంతో హాస్టల్‌ను తనిఖీ చేసిన పోలీసులు నిర్వహకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ అంశంపై పశ్చిమ డిఎస్పి అరవింద్ మీడియాతో మాట్లాడుతూ ఒక హాస్టల్‌లో ఉంటున్న యువతులు ఫిర్యాదు చేశారని దర్యాప్తు జరుగుతదన్నారు. లేడీస్ హాస్టల్ నిర్వహిస్తున్న దంపతులను అదుపులోకి తీసుకున్నామని డిఎస్పి అరవింద్ తెలిపారు. సీసీ కెమెరాలు ఇబ్బందికరంగా ఉన్నాయని అమ్మాయిలు ఫిర్యాదు చేశారన్నారు.

బోర్డు తిప్పేసిన మణికంఠ

లబోదిబోమంటున్న బాధితులు - నిర్వాహకుల ఇంటి వద్ద నిరసన

ప్రజాశక్తి తెనాలి

పట్టణంలో ఓ కోఆపరే టివ్ సొసైటీ బోర్డు తిప్పేసింది. బంగారపు షాపు నిర్వహణతో నమ్మించి సొసైటీ ఖాతాదారులుగా చేర్చుకుని వసూళ్లకు పాల్పడ్డారు. చివరికి మధుపరులకు కుచ్చుటోపి పెట్టి షాపులు, ఇల్లు వదిలి పరారయ్యారు. దీంతో బాధితులు లబోదిబో మటున్నారు . పట్టణానికి చెందిన శ్రీ మణికంఠ మ్యూచ్వల్లీ కో-ఆపరేటివ్ అండ్ త్రిఫ్ట్ క్రెడిట్ సొసైటీ చేతిలో మధుపర్లు మోసపోయిన వివరాలిలా ఉన్నాయి.

మూసి ఉన్న మణికంఠ జ్యువెలర్స్

పట్టణంలోని నాజరుపేటకు చెందిన అన్నదమ్ములు కొల్లూరు వెంకటేశ్వరరావు, భాస్కర్ ఇరువురూ బంగారపు షాపులు నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో షాపుకు వచ్చి పోయే ఖాతాదారులను నమ్మించారు. తాము ఏర్పాటు చేసిన శ్రీ మణికంఠ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ లో ఖాతాదారులుగా చేరాలని కోరారు. తెనాలిలోనే కాకుండా, చావలి ప్రాంతంలోనూ ఖాతాదారులను ఏర్పాటు చేసుకున్నారు. పట్ట ణంలో నెహ్రూ రోడ్డులో అమ్మ కాంప్లెక్స్‌లో, అలాగే చావలిలో పాల కేంద్రం శ్రీను కాంప్లెక్స్ లో సంస్థ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. డిపాజిట్లు సేకరిం చారు. నెలవారి పొదుపులు కట్టించారు. డిపాజిట్లకు, నెలవారీ పొదుపు చేసుకునేందుకు వివిధ రకాల వడ్డీ రేట్లు ప్రకటించి మదుపరులను ఆకర్షించారు. అలాగే బంగారు ఆభరణాలను చేసి ఇస్తామంటూ అడ్వాన్సులు సేకరించారు. మొత్తంగా కోట్ల రూపాయలలో

2లో

నిర్వాహకుల ఇంటివద్ద ఆందోళనలో బాధితులు

బోర్డు తిప్పేసిన మణికంఠ

(మొదటి పేజీ తరువాయి)


NOT TRANSFERABLE ☎ : 228492
SRI MANIKANTA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED
Regd. No:AMC/GNT/DCO/2017/3585
TENALI - 522 201
No. 482 TERM DEPOSIT RECEIPT TNL/FD/46
Received from Sri SEELAM SETTY LAKSHMI W/o S. ANJANEYA VARA PRASAD
Rupees TWO LAKH RUPEES ONLY
as a Deposit repayable ... Days / Months after date with Interest at the rate of ... Present per annum
Principal Rs. ... Interest Rs. ... Maturity Value Rs ...
SRI MANIKANTA MUTUALLY AIDED CO-OP THRIFT AND CREDIT SOCIETY LIMITED
C.E.O CHAIRMAN

మధుపవరుల నుంచి సేకరించిన సొమ్ముతో ఉడాయించారు. నాజరుపేటలోని ఇంటికి తాళం వేశారు. కుటుంబ సభ్యులతో సహా మాయమయ్యారు. షరాఫ్ బజారులో ఉన్న మణికంఠ జ్యూవెలరీ షాపులను రెండు నెలలుగా మూసే ఉంచినట్లు అక్కడ వ్యాపారులు చెబుతున్నారు. బాధితులు ఇదే విషయాన్ని గుర్తించి ఆందోళనకు లోనయ్యారు. ఆది వారం నాజరు పేటలోని నిర్వాహకుల ఇంటి వద్ద నిరసన వ్యక్తం చేశారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు బాధితులు చెబు తున్నారు. ఈ విషయమై వివరణ కోరేందుకు నిర్వాహ కులను ఫోనులో సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు స్పందిం చలేదు. టూ టౌన్ సిఐ రాముల నాయక్ వివరణ కోరగా సొసైటీ విషయం తమ దృష్టిలో లేదని, బంగారపు షాపులో వస్తువులు తాకట్టు పెట్టుకుని మాయం చేశారని రెండు రోజుల క్రితం ఫిర్యాదు వచ్చిందని, దానిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మెషిన్‌తో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

నీట్ పరీక్ష ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నారు. ధృవపత్రాల పరిశీలన ఉండటంతో 11గంటల నుండే కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక హిందూ కాలేజి, ప్రభుత్వ మహిళా కాలేజి కేంద్రాలను సందర్శించి పరీక్ష ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షకు జిల్లా కోఆర్డినేటర్‌గా నల్లపాడు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్ వ్యవహరించారు.

పట్టణంలో వరుస దొంగతనాలు

ఇంటి తాళాలు పగలగొట్టి నగలు చోరీ

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో ఈ మధ్యకాలంలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం పట్టణంలో నడిబడ్డులోని 13వ వార్డులో నివాసం ఉంటున్న బంగారు వ్యాపారింట్లో పట్టపగలే దొంగలు పడి బంగారం డబ్బులు దొరికినంత దోచుకుపోయారు. అది మరువక ముందే స్థానిక పాత బజారు బంగారపు కొట్ల సమీపంలో ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకొని తాళాలు పగలగొట్టి శనివారం రాత్రి బంగారం నగలు దోచుకెళ్ళారు. 18 వ వార్డులో నివాసం ఉంటున్న మహేశ్వరపు ఆశాజ్యోతి తన కుమార్తెతో కలిసి బంధువుల ఇంటికి సిరిగిరిపాడు 30-4-25 న వెళ్ళింది. పక్కింట్లో నివాసం ఉండే రోహిణి నాలుగో తేదీ ఆదివారం ఉదయం ఫోన్ చేసి మీ ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయని కబురు పెట్టడంతో వచ్చి చూసే సరికి ఇంటి తాళాలతో పాటు బీరువా తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు నగలు రూ.పాతికవేల రొక్కం దోచుకు వెళ్లారు. ఈ మేరకు ఆశాజ్యోతి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు వరుస దొంగతనాలు పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాగర్ బాబు పై కేసు నమోదు

ప్రజాశక్తి పెదకూరపాడు

మండలంలోని కాశిపాడు గ్రామంలో గుడ్డేటి సాగర్ బాబు పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు. సాగర్ అను అతనిని అదే గ్రామానికి చెందిన ఇసుకల వంశీకి పాత గొడవలను మనసులో పెట్టుకుని కర్రతో తలపై కొట్టగా తలకు కొట్టాడు. దీంతో తీవ్ర గాయమైనందున పోలీస్ స్టేషన్కు వచ్చి రిపోర్ట్ ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

(మొదటి పేజీ తరువాయి)

చేసు కున్న కొందరు అప్పులు ఇచ్చి రూ.10 వడ్డీ వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింద న్నారు. మహాలక్ష్మి కాలనీలో నివసిస్తున్న వారందరూ కాగితాలు, ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారని, కొందరు రోజువారి పనికి వెళ్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పిస్తు న్నామని చెప్తున్నా అధికారులకు ఇక్కడ కూలీలు కనపడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తు ందని, కాలనీ వాసులకు జాబ్ కార్డులు అంటే కూడా తెలియని పరిస్థితిలో ఉన్నారని అందుకు అధికారులు సిగ్గుపడాలన్నారు. అలాగే అరుం ధతి కాలనీ వాసులకు గతంలో 3 సెంట్లు చొప్పున 56 మందికి నివేశన స్థలాలు ఇచ్చారని నేటికీ అధికారులు మౌలిక వసతులు కల్పించలేదని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన స్పందించకపోవడంతో 26 మంది లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ సమస్యలపై స్పందించి పేదలకు విద్యను అందించి, మాయా ఎస్సీ ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం నాయకులు గోపాలరావు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో ఉన్న అగ్రహార భూ సమస్యలు పరిష్కారం కాకపోవటంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, భూ సమస్యను పరిష్కరించి రైతులకు హక్కులు కల్పించాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులుపై ఉందన్నారు. అలాగే వినుకొండ ప్రాంతంలో రైతులు పొగాకు సాగు చేశానని, ఐటీసీ బోర్డుతో బాండింగ్ ఉన్నవాళ్ల పంటను అమ్ముకున్నారని, అయినప్పటికీ పూర్తిగా పొగాకు కొనుగోలు చేయకపోవడంతో చాలామంది రైతులు దగ్గర పంట నిల్వ ఉందన్నారు. రాష్ట్ర మంత్రి అచ్చమనాయుడు ఏప్రిల్ 29న రైతుల వద్ద ఉన్నపకాలు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. వైట్, బ్లాక్ బర్లీ పొగాకును మే నెలలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పల్నాడు ప్రాంతానికి జీవనాడి అయినా వరికాపూడిశల ప్రాజెక్ట్ అంశాన్ని ప్రభుత్వం పక్కనపెట్టి గోదావరి-బనకచర్ల జలాశయాన్ని తెరమీదకి తెచ్చి వరికపూడిశలను పూర్తిగా మరిచిపోతున్నారని, గత డిపిఆర్ ప్రకారం నిబంధనల మేరకు ప్రాజెక్టు పనులను ప్రభుత్వం ప్రారంభించాలని రైతుల భూ సమస్యలను, ప్రజల మౌలిక సదుపాయాల సమస్యలను ప్రభుత్వం విస్మరిస్తే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో వినుకొండ పట్టణ కార్యదర్శి బంకూరు వెంకటేశ్వర్లు, కే. హనుమంత్ రెడ్డి, వెంకటప్పయ్య, ముని వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

మధుమేహానికి హబ్‌గా భారత దేశం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం మధుమేహం, బి.పి వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సభలో ప్రముఖ మధుమేహవ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ భారతదేశం డయాబెటిక్ హబ్‌గా మారిందన్నారు. ఈ సమస్యకు మూల కారణం జీన్స్, ఊబకాయం, సరైన వ్యాయామం తీసుకోకపోవటమే కారణం అన్నారు. కావున వారానికి కనీసం ఐదురోజులు గంట చొప్పున వ్యాయామం చేస్తూ, మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సమయానికి తీసుకుంటూ, గ్లైసిమిక్ ఇండెక్స్ అధికంగా గలిగిన వైట్‌రైస్, కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉన్న ఆహారము తీసుకోవడం తగ్గించాలన్నారు. సపోటా, మామిడి , సీతాఫలం, పనస, అరటికాయ, పైనాపిల్ లాంటి హైగ్లైసిమిక్ ఇండెక్స్ కలిగిన పండ్లను తీసుకోకూడదని తెలిపారు.సాధారణంగా మధుమేహం పరీక్ష చేయించుకున్నప్పుడు తినకముందు 110 తిన్న తర్వాత 150 వరకు ఉండవచ్చున్నారు. మూడు నెలల సగటు తెలిపే హెచ్‌బిఎ1సి పరీక్ష చేయించుకున్నప్పుడు 5.6లోపు ఉంటే మధుమేహం అదుపులో ఉన్నట్లుగా భావించాలన్నారు. ఈషుగర్ వ్యాధి వలన మన శరీరంలో వివిధ అవయవాలకు రక్త సరఫరా చేసే రక్తనాళాలు దెబ్బతినటం వలన రక్త సరఫరా సరిగా అవ్వక, అవయవాలకు కూడా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ప్రాసెస్డ్ ఫుడ్, జంక్ ఫుడ్, అధిక కొవ్వు శాతం కలిగిన ఆహారం తినకూదని సూచించారు. జీవనశైలి ఆరోగ్యకరంగా మార్చుకొని, బరువును అదుపులో ఉంచుకుంటూ మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే మధుమేహం అదుపులో ఉంటుందని తెలియజేశారు. ఆరోగ్యం గురించి సోషల్ మీడియాలో వచ్చే వివిధ రకాల దుష్ప్రచారాలను నమ్మవద్దని, అలా నమ్మి అనుసరిస్తే చాలా సందర్భాల్లో అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వైద్యుడిని నేరుగా కలిసి చికిత్స తీసుకోవటం ఉత్తమమన్నారు.



డాక్టర్ రామ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అవగాహన సభ్యులు

సభ్యులు అడిగిన సందేహాలను డాక్టర్ నివృత్తి చేశారు. అనంతరం డాక్టర్ రామ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా , వాణిజ్యవేత్త బాదం బసవగుప్త, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు కె. చంద్రశేఖర రావు పాల్గొని ప్రసంగించారు.

ఎండల్లో హోయి...హోయి

(మొదటి పేజీ తరువాయి)

గాలులతో తాడేపల్లి ప్రాంతంలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురవడంతో అరటి, మామిడి చెట్లు నేలకొరిగాయి. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. ఊహించని హఠాత్ పరిణామానికి తాడేపల్లి మండలంలోనిపలు గ్రామాల్లో సుమారు రెండు గంటలు పాటు జనజీవనం స్తంభించింది. భారీగా వీచిన గాలులకు ఉండవల్లి పెనుమాక గ్రామంలో అరటి, మునగ వేసిన రైతులు నాలుగు కోట్ల రూపాయలు నష్టపోయారు. పెద్ద ఎత్తున వీచిన గాలులకు అరటి చెట్లు మొత్తం నేల వాలాయి. దీంతో అరటి గెలలు కూడా పడైపోయాయని రైతుల ఆందోళన చెందుతున్నారు. అరటి చెట్టుకు సపోర్టుగా కట్టిన కర్రలు కూడా విరిగిపోయాయి. సిఎం, ప్రతిపక్ష నాయకులు, ఇతర విఐపిలు అధికంగా నివశిస్తున్న నేపథ్యంలో తాడేపల్లి ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు విరిగిపోవటంతో యుద్ధప్రాతిపదికిన గంటల వ్యవధిలోనే విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరించారు. చిలకలూరిపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో వర్షానికి పొగాకు పంటకు నష్టం జరిగింది. పొగాకు ఆకులు రంగు మారే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే ధర లేక అల్లాడుతున్న రైతులకు దెబ్బమీద దెబ్బ అన్నట్టుగా వర్షానికి బర్లీ పొగాకు తడిసి రైతులు లబోదిబో అంటున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు పరిసర గ్రామాల్లో ఆదివారం ఉదయం వర్షం కురిసింది.ఉరుములు,మెరుపులతో 40 నిమిషాల పాటు వర్షం కురవడంతో రాజధాని నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది.శాఖమూరు దగ్గర రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా జెసిబి లతో చేస్తున్న మట్టి తవ్వకం పనులు నిలిచిపోయాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయంది.మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మిర్చి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలోని డెల్టా ప్రాంతంలో జొన్న, మొక్కజొన్న పంటలకు కూడా స్వల్పంగా నష్టం వాటిల్లింది.

చిలకలూరిపేట మండలం మురికిపూడిలో పొగాకు తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు

బోధిస్తున్న అబ్దుల్ రెహ్మాన్

ప్రాంతీయ గ్రంధాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. ఆదివారం నిర్వహించిన శిబిరంలో వైద్యశాఖ సూపర్‌వైజర్ అబ్దుల్ రెహ్మాన్ హాజరై పువ్వుల ప్రాధాన్యత, దానిలోని విడి భాగాల గురించి, ఏ భాగం ఏవిధంగా పనిచేస్తుందో వివరించారు. అనంతరం పిల్లలకు మానసిక ఉల్లాసం కలిగించేలా కథలు పెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రరీ అండ్ గ్రేడ్ 1 షేక్. ఖయ్యూం, సిబ్బంది ఎ.నాగేశ్వరరావు, దయానంద్ పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- తాడేపల్లి

ఉండవల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఢీకోల్లు చైతన్యకు మంత్రి నారా లోకేష్ రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం ఉదయం భారీ ఈదురు గాలులతో ఢీకోల్లు చైతన్య ఇంటి పైకప్పుకు ఉన్న రేకులు ఎగిరిపోయాయి. విషయంను స్థానిక నాయకులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఢీకోలు చైతన్య ఇంటికి నాయకులను పంపించి రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందజేయించారు. దీనితో బాధితుని కుటుంబ సభ్యులు మంత్రి నారా లోకేష్‌కు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి జోతిబసు, నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రాయపూడి కిరణ్, గాదె వినాయ్, వల్లభపురం శంకర్, బసివిరెడ్డి, దాసరి కష్ణ, గాదె శ్రీనివాసరావు, తుపాకుల కోటి, తోట సాంబశివరావు, రాము, సంకురు ప్రశాంత్, లీలాకృష్ణ, చిలువూరు అనిల్, కమలనాథుడు పాల్గొన్నారు.

బకింగ్ హోం కాలువను పరిశీలించిన మంత్రి లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం పున:ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని ముగించుకుని మంగళగిరికి పయనమైన మంత్రి లోకేష్ మార్గమధ్యలో కాజ-చినవడ్లపూడి మధ్యలో గల బకింగ్ హోం కాలువను ఆదివారం పరిశీలించారు. కాలువలో పెద్దఎత్తున గుర్రపు డెక్క పూడుకుపోవడాన్ని గమనించారు. వర్షాకాలంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా గుర్రపు డెక్కను తొలగించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. లోకేష్ వెంట నందం అబద్దయ్య ఉన్నారు.

హైవేపై కంటైనర్ లారీ బీభత్సం..

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు మండలం తిమ్మాపురం శివారులో ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నై నుంచి గుంటూరు దిశగా వేగంగా ప్రయాణిస్తున్న కంటైనర్ లారీ, డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా అదుపుతప్పి నేరుగా హైవే సెంట్రల్ డివైడర్‌పై ఎక్కింది. అక్కడ ఏర్పాటు చేసిన భారీ ఇనుప స్తంభాన్ని ఢీకోవడంతో వాహనం ముందు భాగంతో పాటు స్తంభానికి బిగించిన సీసీ కెమెరాలు ధ్వంసం అయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, ఇనుప స్తంభాలను తొలగించి రహదారి మీద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్న సమయం కావడం, వా హనాల రద్దీ లేకపోవడం, ఎవరికీ గాయాలు కాలేదు. పెను ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి డ్రైవర్ అలసట, నిద్ర మత్తే ప్రధాన కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రమాదం జరిగిన చోట సీసీ కెమెరాలు ధ్వంసమైన నేపథ్యంలో, యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించి ట్రాఫిక్‌ను సరళీకృతం చేసినట్లు ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపారు.

- వాహనంతో పాటు సీసీ కెమెరాలు ధ్వంసం
- తిమ్మాపురం శివారులో రోడ్డు ప్రమాదం
- డ్రైవర్ నిద్రమత్తుతోనే ఘటన
- తప్పిన పెనుప్రమాదం

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఓటర్ల జాబితాలో అవకతవకలు అరికట్టాలి

ప్రజాశక్తి - గుంటూరు

ఒక్క ఓటు తేడాతో ఎన్నికల్లో జయాపజయాలు నిర్ణయమయ్యే మన దేశంలో ఓటర్ల జాబితాలో అవకతవకల కట్టడికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఉండి తీరాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తప్పుల తడకలుగా తయారవుతున్న ఓటర్ల జాబితాలో చాలా మంది పేర్లు గల్లంతవుతున్నాయని, దొంగ ఓట్లను గంపగుత్తగా చేర్పించే కుట్రలు యదేచ్ఛగా సాగుతున్నాయని ఆరోపించారు. ఈ మధ్య మతతుల వివరాలను ఎప్పటికప్పుడు తీసుకుంటూ వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి వేగంగా తొలగించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధపడటం హర్షణీయం అన్నారు. కృత్రిమ మేధ వంటి సాంకేతికలతో అద్భుతాలు ఎన్నో సాకారమవుతున్న ప్రస్తుత తరుణంలో దేశీయ ఓటర్ల జాబితాలను ఆన్‌లైన్‌లో ఒకచోటకు చేర్చి డూప్లికేషన్లను గుర్తించటం, నకిలీలను తీసివేయడం అసాధ్యమైతే కాదని అన్నారు. డిజిటల్ ఉపకరణాల సాయంతో ఓటర్ల లిస్టులను సంస్కరించటంలో ఈసీ క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటో సీజ్

ప్రజాశక్తి - చేబ్రోలు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ఆటోను ఆదివారం చేబ్రోలు పోలీసులు సీజ్ చేశారు. శనివారం అర్ధరాత్రి పొన్నూరు రూరల్ సర్కిల్ సి ఐ వై.కోటేశ్వర రావు మరియు చేబ్రోలు ఎస్సై వెంకట కృష్ణ సిబ్బందితో కలిసి చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గల బ్రాహ్మణకోడూరు అడ్డరోడ్డుకి దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపీ 39 వి ఈ 0256 నెంబర్ గల అశోక్ లేల్యాండ్ దోస్త్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించడం జరిగిందని ఎస్ఐడి వెంకటకృష్ణ తెలిపారు. సదరు వాహనంలో సుమారు 70 బస్తాలలో (3.5 టన్నుల) రేషన్ బియ్యాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.. సదరు వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ ని అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందని , రేషన్ బియ్యాన్ని సంగం జాగర్లమూడి నుండి బాపట్ల కి తీసుకొని వెళ్తున్నట్టు తెలిసిందని తెలిపారు. సదరు రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వాహనాన్ని సీజ్ చేసి ,కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు

ప్రశాంతంగా నీట్ పరీక్షలు

ప్రజాశక్తి - తెనాలి రూరల్

తెనాలి కేంద్రీయ విద్యాలయ పరీక్షా కేంద్రం వద్ద నీట్ పరీక్షల ఏర్పాట్లను తెనాలి తాశీల్దార్ కెవి గోపాలకృష్ణ ఆదివారం పరిశీలిం చారు. ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్-యూజీ 2025) ప్రశాంతంగా ముగిసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్ఐఏ ఈ పరీక్ష బాధ్యతలను చేపట్టింది. తెనాలి పట్టణంలో రెండు పరీక్షా కేంద్రాల వద్ద నీట్ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు దగ్గరుండి పరిశీలించారు. చెంచుపేట కెఎస్ఎం ఉన్నత పాఠశాలలో 212 మంది విద్యార్థులకు గాను 204 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ అబ్జర్వర్ మేకల లక్ష్మీనారాయణ తెలిపారు. చినరావూరు కేంద్రీయ విద్యాలయ పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులకు గాను 233 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్ష కేంద్రం పరిశీలకులు గోపాలకృష్ణ తెలిపారు. విద్యార్థులు ధరించిన ఆభరణాలు, ఉపకరణాలను అధికారులు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించలేదు. మెటల్ డిటెక్టర్ ద్వారా పూర్తి తనిఖీలు నిర్వహించి విద్యార్థులను పరీక్ష హాల్లోకి అనుమతించారు. పటిష్ట పోలీసు భద్రత నడుమ నీట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు వెల్లడించారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణ, రూరల్ స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్సైలు. మాచర్ల రూరల్ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తున్న రవికుమార్ బదిలీపై క్రోసూరు పోలీస్ స్టేషన్కు వెళ్లారు. పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తున్న వి. నరసింహా రూరల్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఆస్థానంలో గుంటూరు నుండి బదిలీపై వచ్చిన టి. వెంకటరమణ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

ముగిసిన కొలంకపురి నాటక కళా పరిషత్ నాటిక పోటీలు

ప్రజాశక్తి - తెనాలి

కొలంకపురి నాటక కళా పరిషత్, శ్రీ సాయి ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో రూరల్ గ్రామం కొలకలూరు చిన్ని రథశాల వద్ద ఈ నెల 2న ప్రారంభమైన ఇరు తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ముగింపు సభలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రగతి కళ మండలి రథసారధి నూతలపాటి సాంబయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎడ్లపాడు వేదిక సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఎం సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో గోపరాజు బాల త్రిపుర సుందరమ్మ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటి సురభి ప్రభావతికి గోపరాజు రమణ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అందించారు. ప్రముఖ రూపశిల్పి ఎం మదన్మోహనరావు స్మారకంగా పచ్చల శేషగిరిని సత్కరించారు. గ్రామీణ ప్రాంతంలో నాటక రంగ కళావైభవానికి ప్రతీకగా నాటిక పోటీలు జరుగుతున్నాయని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కొలంకపురి నాటక కళాపరిషత్ గౌరవ సలహాదారు వల్లూరి శివప్రసాద్, కళావాణి కార్యదర్శి చాగంటి నాగేశ్వరరావు, దర్శనాపురి నాటక కళాపరిషత్ చైర్మన్ కల్లకొలను అనంత్, గోపరాజు రమణ, ఎస్ మురళీధర్, కాంతారావు, గోపరాజు విజయ్ పాల్గొన్నారు.


అసత్యం నాటికలో సన్నివేశం

సమాజానికి కనువిప్పుగా నాటకాలు...

ఇరు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన నాటిక పోటీలో చివరి రోజున ప్రదర్శించిన మతమా మానవత్వమా నాటిక సమాజానికి కనువిప్పుగా నిలిచింది. పక్కపక్క ఇళ్లలో నివసించే రామశాస్త్రి, రెహమాన్ హిందూ ముస్లిలు. ఎంతో ప్రాణ స్నేహితుడిగా ఉండేవారు. రామశాస్త్రి కుమారుడు వెంకట శాస్త్రి తండ్రి తో పాటు అర్చకత్వం తదితర కార్యక్రమాలలో పాల్గొనేవాడు. ఒకరోజు ఆలయ తలుపులు తీయకపోవటంపై తండ్రి కుమారుడిని ప్రశ్నిస్తాడు. ఆ సమయంలో వెంకటశాస్త్రి తాను క్రైస్తవునిగా మారానని చెప్పటంతో, తండ్రి ఆగ్రహిస్తాడు. వారి మధ్య జరిగిన తీవ్ర వాగ్వివాదంలో రామశాస్త్రి గుండెపోటుకు గురై మరణిస్తాడు. అతనికి కర్మకాండలు నిర్వహించాలని తల్లి కోరినా ససేమిరా అంటాడు. అప్పుడు కర్మకాండ చేయాల్సిన బాధ్యతను తల్లి వివరించడంతో హిందువైనా ముస్లిం అయినా క్రైస్తవులైనా మతం ప్రధానం కాదని మానవత్వమే ముఖ్యమని నాటిక ఇతివృత్తంగా సాగుతుంది. చైతన్య కళ స్రవంతి వారు ప్రదర్శించిన అసత్యం నాటిక దైవత్వమైనా మానవత్వమైనా మనిషి హృదయం లోనే ఉంటుందని, ప్రతి సత్యం, అసత్యం వెనుక మనిషి స్వార్థమో భయమో, భయమో దాగి ఉంటుందని, ఏదైనా మంచికి దోహదపడితే చాలని ఇచ్చే సందేశమే అసత్యం నాటిక. మూడవ ప్రదర్శనగా సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు నాటికను ప్రదర్శించారు. పి టి మాధవ్ రచనకు గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.

[illegible]
OS.No. 195/2023
Between:
[illegible] ... వాది
And
1. [illegible]
2. [illegible]
...ప్రతివాదులు
నోటీసు
పై నెంబర్ దావా లో [illegible] శ్రీ కోర్టు వారి [illegible] మీరు [illegible] 10-30 [illegible]
వాయిదా తేదీ : 03/03/2025.
[illegible]
08/05/2025.
[illegible]
ప్రతివాది తరఫు న్యాయవాది
సెల్ నెం.84402 07854

[illegible]
IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE
(JUNIOR DIVISION): SATTENAPALLI
O.S.NO.210/2020
Between:
Alladi Narasimha Rao ... Plaintiff
And
Arisetty Srinivasa Rao ... Defendant
To
Arisetty Srinivasa Rao, S/O Veeraswamy, Hindu, aged about 52 years, Business, resident of Door No. 24 22 12, 11th line, Nallacheruvu, Near Vinayaka Swamy temple, Guntur City and mandal, Guntur District.
[illegible] 14.05.2025 [illegible] 10-30 [illegible]
[illegible]
వాయిదా తేది: 14.05.2025.
[illegible]

బహిరంగ ప్రకటన

[illegible] ఇం.నెం.4-110/1, [illegible] O.S.245/2016 [illegible] ది.16 04 2025 [illegible] O.S.245/2016 [illegible]
[illegible]
[illegible] 116 [illegible] ఎ.1.00 [illegible]
[illegible] (A schedule) [illegible] ఎ.1.00 [illegible]
[illegible]
తేది:05-05-2025
[illegible]
సెల్: 9949152585

బహిరంగ ప్రకటన

[illegible] (1) [illegible] (2) [illegible] (3) [illegible] (4) [illegible]
[illegible] ది.14 02 1988 [illegible] ది.08-12-1985 [illegible] ది.20-04-2014 [illegible] ది.24-04-2025 [illegible]
[illegible]
[illegible] నెం.17, ప్రస్తుత వార్డు నెం.1, పాత సర్వే నెం. 180, 872, [illegible] 2/1, [illegible] 2-15-182 [illegible] తూర్పు - [illegible] అ.29ఇం., దక్షిణం - [illegible] 105ఇం., పడమర - [illegible] అ.29ఇం., ఉత్తరం - [illegible] అ.105ఇం. [illegible] 336 33 [illegible] 282 88 [illegible]
నరసరావుపేట, తేది.04-05-2025.
[illegible] M.A, LLM
[illegible] B.Com.LLB
[illegible] B.A, LLB
[illegible]

వర్షంతో పొగాకు రైతు కుదేలు

జడ్‌పి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పాఠశాల రుణం తీర్చుకోలేనిది

ప్రజాశక్తి - రెంటచింతల

ఒక చెట్టు కొమ్మలో విరబూసిన మొగ్గలం అంటూ కలిశారు... జ్ఞాపకాలను కలబోసుకున్నారు... వారే పాలువాయి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు. 2000-04 వరకు పాఠశాలల్లో పదవ తరగతి చదివిన 210 మంది బాలబాలికలు ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని చిన్ననాటి తీపి జ్ఞాపకాలను చదువుకునే రోజుల్లో చేసిన సంఘటనలను గుర్తుకు చేసుకుంటూ ఆనంద పరవశులయ్యారు. మృతి చెందిన ఆరుగురికి నివాళులర్పించారు పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు సంబంధించి రూ.30 వేలను విరాళంగా అంద జేశారు గురువులైన సీతారెడ్డి శ్రీనివాసు ప్రసాద్ మల్లికార్జున శర్మ రఘురామమూర్తి లింగారెడ్డి ప్రమీలను ఘనంగా సత్కరించి గురుత్వాన్ని చాటుకున్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

ఈశ్వర్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి, ఇఎన్‌టి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కేశానుపల్లి గ్రామ పరిధిలో గల ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎన్ఎస్ఎస్ యూనిట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆద్వర్యంలో శం కర కంటి ఆసుపత్రి సౌజన్యంతో గుంటూరు జిల్లా ఫిరంగి పురం మండలం నుదురుపాడు గ్రామంలో ఉచిత కంటి, ఈఎన్‌టి వైద్య శిభిరం నిర్వహించారు. శిబిరంలో ప్రముఖ ఈఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ షేక్. వశీం మీరా, శంకర కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ షఫాలి, డాక్టర్ శృతి, ఆడి యాలజిస్ట్ డాక్టర్ ఆదిత్య పాల్గొని, వైద్య పరీక్షలు చేశారు. ఈ మెగా క్యాంపులో మొత్తం 527 మందికి కంటి పరీక్షలు జరుగగా 184 మందికి కంటి శస్త్ర చికిత్స అవసర మని నిర్ధారించారు. కార్యక్రమంలో ఈశ్వర్ కళాశాల ఛైర్మన్ షేక్. మీరావలి, సెక్రటరీ, కరస్పాండెంట్ షేక్ కరీం మోహి ద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్. మస్తాన్ షరీఫ్, ప్రిన్సిపల్ డాక్టర్ జి. నాగమల్లేశ్వరరావు, నుదురుపాడు గ్రామ సర్పంచ్ గొట్టం చౌడయ్య, స్కూల్ హెచ్ఎంజి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నీటి కోసం వానరానికి తిప్పలు

వేసవిలో దాహం తీరాలంటే ఫీట్ చేయాల్సిందే

ప్రజాశక్తి - మాచర్ల

వేసవిలో దాహం తీరాలంటే ఫీట్ చేయాల్సిందే... పట్ట ణంలోని ఓఇంటి వాటర్ ట్యాంకు నిండి, పైపు ద్వారా నీరు కిం దకు పడుతుంది. తీవ్ర దాహంతో వున్న ఓ వానరం పైపు ద్వారా కింద పడుతున్న నీటిని తాగటానికి చేసిన ఫీట్లు చూపరులను కట్టిపడేసింది.

మురికిపూడి పొలాల్లో వర్షాలకు పట్టలు కప్పిన పొగాకు

గతేడాది రేట్లకు కంపెనీలు కొనేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

రైతు నాయకుల డిమాండ్

టార్పాలిన్ పట్టలు కొనటం, కప్పటం, ఆర బెట్టటం అదనపు భారమంటోన్న రైతులు

కుటుంబాలు జరగక కనీసం కూలి ఇవ్వలేని పరిస్థితుల్లో పొగాకు రైతులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రతి పల్లెలో ఎక్కడ చూసినా పొగాకు (నల్ల బర్లీ..హెచ్‌డి.పొగాకు)మండేలే కన్పిస్తున్నాయి. ఇప్పటికే పొగాకు మొదటి, రెండు వలసిన ఆకులు రంగు మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫస్టు,సెకండ్ ఆకులను కొంటారా.. కొంటె ఇంతకు కొంటారో అనే మీ మాంసలో వున్నామంటున్నారు. దానికి తోడు మండలంలో కొన్ని గ్రామాల్లో (మురికిపూడి, బొప్పూడి, క్రొత్త రాజాపేట) ఆదివారం ఉదయం అకాల చిరుజల్లులు పొగాకు రైతులను పరుగులు పెట్టించాయి. ఆరు కాలం పండించిన పంటను కాపాడు కోవడానికి మురికిపూడిలో కుటుంబాలకు, కుటుంబాలు ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలో 4500 ఎకరాల్లో వేల మంది రైతులు సాగు చేశారు. వ్యవసాయ సీజన్ ఈ నెలాఖరు ప్రారంభం కావస్తోంది. ఇంత మటుకు పండించిన పొగాకు పంట క్వింటా కూడా అమ్మని రైతులు వేల సంఖ్యలో ఉన్నారు. ఒక్క మండల స్థాయిలోనే పంట లక్షల క్వింటాలు నిల్వలు ఉంటున్నాయి. ఈ పంటలను మొత్తం ఎప్పటికీ కొంటారో..తెచ్చిన అప్పులు తీరతాయో లేదో..నస్టాలను ఎట్లా తీర్చాలో అని రైతులు అయోమయ స్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పొగాకు పంటను కంపెనీలు కొనెలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా ఏ.పి. కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. రాధాకష్ణ ఆదివారం మురికిపూడి, బోప్పుడి, కొత్త రాజాపేట పాతరాజాపేట, గోపాలంవారి పాలెం, పోతావరం గ్రామాన్ని సందర్శించి పొగాకు రైతులతో మాట్లాడారు. మురికిపూడి గ్రామం లో షుమారుగా వేలఎకరాల్లో పొగాకు పంటను సాగు చేశారనీ, కొనుగోలు చేయకపోవడం వల్ల ప్రతి రైతు ఇళ్లల్లో, పొలాల్లో ఎక్కడ చూసిన ఈ పొగాకు మండేలే కన్పిస్తున్నాయన్నారు. రెండు రోజుల నుంచి మబ్బులు కమ్ముతున్నాయనీ, ఎప్పుడు ఎక్కడ వర్షం పడుతుందో తెలియదని వర్షం వస్తే పంట దెబ్బ తిని, ఆకు రంగు మారే అవకాశం ముందన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ అధికారులు తగు చర్యలు తీసుకుని ఈ పొగాకును కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మురికి పూడి గ్రామ రైతు పెరుబోయిన వెంకట్రావు మాట్లాడుతూ ఏకరంన్నర సాగు చేస్తే షుమారుగా 8,9 క్వింటాళ్ల మంచి పొగాకు 9 క్వింటాలు గుల్ల పొగాకు వచ్చిం దన్నారు. గుల్ల పొగాకును దారుణంగా 1500/1600 వందలకు ప్రయి వేటు వ్యక్తులు అడుగుతున్నారన్నారు. మంచి పొగాకును అడిగిన నాధుడే లేరంటున్నారు. ఎకరంన్నరకు ఖర్చులు షుమారుగా రూ. లక్ష ఇరవై వేలు అంయిదన్నారు. సొంత పొలం అయినందున కౌలు లేదన్నారు. కనీసం పోయి సంవత్సరం రేట్లకు అయిన కొంటె అప్పులు లేకుండా బైట పడతామన్నారు. తెచ్చిన చోట అప్పులకు వడ్డీలు పెరిగి పోతున్నాయని కొద్దీ రోజుల్లో సీజన్ ప్రారభం కానున్నదని ఏమి చేయాలో పాలుపోవటం లేదని రైతు సంఘ నాయకుల ముందు వాపోయారు.

మురికిపూడికి చెందిన వంకాయల పాటి కోటేశ్వరరావు అనే రైతు మాట్లాడుతూ ఈ సంవత్సరం మొత్తం మూడున్నర ఎకరాల్లో నల్లబర్లీ పొగాకు చే శానని కొంత గుల్ల పొగాకు వచ్చిదని ఎకరా కు దిగుబడి 10 క్వింటాలు వరకు వచ్చి దన్నారు. పొగాకు కొంటాము అనే వ్యక్తులే లేరు. దానికి తోడు ప్రకతి వైపరీత్యాల వల్ల అప్పుడ ప్పుడు కురుస్తున్న వర్షాల నుంచి పంటను కాపాడుకోవడానికి కార్బన్ పట్టణం 250 రూపాయలు చొప్పున నాలుగు పట్టలు అంటే రూ.1000లు పెట్టి కనాల్సి వచ్చిందన్నారు. కూలి ఖర్చులు భరించలేక కుటుంబ సభ్యులమే వర్షాలు వచ్చినప్పుడు పట్టలు కప్పుకోవటం తీసి పొగాకును ఆరబెట్టుకోవటం చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా పొగాకు కొనుగోలు చేస్తే కొద్దీ నష్టాలతో బయటపడే అవకాశం ఉందని రైతు నాయకుల ముందు వాపోయారు.

పొగాకు కు పరిశీలిస్తున్న నాయకులు రాధాకృష్ణ

గోపాలంవారి పాలెంకు చెందిన కిన్నెర బాబు మాట్లాడుతూ 10 ఎకరాలు ఉన్నా ప్ర స్తుతం కుటుంబం గడవడమే కష్టంగా ఉందన్నారు. పొగాకు కొనుగోలు లేకపోవడంతో కూలీలకు డబ్బులు ఇవ్వలేక పోతున్నామన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి పోతున్నా యన్నారు. ప్రస్తుతం ఏ కంపెనీలు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంలేదనీ, కొనుగోలు ప్రారంభిస్తే మంచి రకం పొగాకును మాత్రమే కొంటామని అంటున్నారన్నారు. రెండవ రకం పొగాకు ఎవరికి అమ్మాలో తెలియక అయోమయంలో ఉన్నామన్నారు. ఇప్పటి కైన ప్రభుత్వం స్పందించి కంపెనీ ద్వారా మొత్తం పొగాకు కొనుగోలు చేయిస్తే బాగుంటుం దని ఆ విధంగా చర్యలను తీసుకోవాలని రైతు నాయకుల ముందు వాపోయారు.

మురికిపూడి రైతు కోటేశ్వరరావుతో మాట్లాడుతున్న నాయకులు

ధరలు పతనంతో దిక్కుదోచని మిర్చి రైతు

గతంలో రూ. లక్ష, ప్రస్తుతానికి రూ. లక్షన్నరకి పెరిగిన ఖర్చులు

తాలుకాయల్లో ఎర్రకాయలేరిస్తున్న రైతులు ...చివరి కోతలు వదలి వేసిన వైనం

కారం కిలో రూ. 250...బహిరంగ మార్కెట్లో కిలోఎండు మిర్చి రూ. 150/180లు

తెగుళ్లు, పురుగుల వల్ల దెబ్బతిన్న మిర్చి పంట

ప్రజాశక్తి - చిలకలూరిపేట

దిగుబడి తగ్గడంతోపాటు ధరలుసైతం పతనం కావ డంతో మిర్చి రైతులు ఎకరాకు రూ.అరలక్షకుపైగా నష్టాన్ని మూటగట్టుకొంటున్నారు. గతేడాది పంటను కోల్డ్ స్టోరేజీల్లో దాచుకున్నవారు సైతం తగ్గిన ధరలకు ఆ పంటను అమ్ముకో లేక అద్దెల భారాన్ని భరిస్తున్నారు.

చిలకలూరిపేట మండలంలో 2200 ఎకరాల్లో మిర్చి సాగవగా ఎకరాకు దిగుబడి 12-15 క్వింటాళ్ల మధ్య వచ్చింది. ఇది గతేడాది 18-20 క్వింటాళ్ల వరకు ఉంది. నల్లి, తెల్లదోమ వంటివి దిగుబడి తగ్గడానికి కారణా లుగా రైతులు చెబుతున్నారు. ఎకరగా పెట్టుబడి రూ.లక్షన్నర వరకు ఉండ గా తెగుళ్లు, పురుగుల నివారణకు అదనంగా 15-20 శాతం ఖర్చు చేయాల్సి రావడం ఒకటైతే ఇటీవల వానల నుండి పంటను కాపాడు కోవడానికి టార్ఫాలిన్ పట్టాలనూ రైతులు కొనాల్సి వచ్చింది. తెగుళ్లు, పురుగుల వల్ల పంట తొలిదశలో కాయ మచ్చ ఏర్పడి దెబ్బతింది. కొన్ని కుళ్లిపోయాయి. తాలుశాతమూ పెరిగింది. దీంతో వ్యాపారులు పంట కొనేటప్పుడు ధరలు మరింత తగ్గిస్తున్నారు. చివరి కోత పంట ఉన్నా కోయించడానికి రైతులు ఆసక్తిగా లేరు. సన్న కాయలు కావడం, మొక్కలు ఎండిపోవడం, గడ్డి ఎక్కువగా ఉండడం తదితర కారణాల వల్ల కోతకూలి కూడా రాదనే భావనలో రైతులున్నారు. గతంలో క్వింటాళ్‌కు 70 గ్రాముల తాలుకాయలుంటే ఇప్పుడు 200-250 గ్రాములు ఉంటోందని రైతులు వాపోతున్నారు.

ఇదిలా ఉండగా మిర్చి పంటకు గతేడాది రకాన్ని బట్టి క్వింటాళ్ రూ.18 వేల నుండి రూ.23 వేల వరకు ఉండగా ఈ ఏడాది రూ.8-9 వేలలోపే ఉంది. తేజ, బాడిక రకాలకు రెండేళ్ల క్రితం రూ.25 వేల వరకు కొంటే ఇప్పుడు నాణ్యత పేరుతో రూ.6-8 వేలకు మించి కొనడం లేదు. మరోవైపు మార్కెట్‌లో కిలో మిరపకాయలు రూ.160 అమ్ముతున్నారు. కిలో కాయలకు రూ.900 గ్రాముల కారం వస్తుంది. మార్కెట్‌లో కారం ధర కిలో రూ.240కు పైగా ఉంది. మార్కెట్లో ఉన్న ధరలు తమకు దక్కడం లేదని, తాము నష్టపోతుంటే దళారులు, వ్యాపారులు లాభపడుతున్నారని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం వీటన్నింటినీ గమనించి మద్దతు ధరలు వచ్చేలా చూడాలని, వంకలు పెట్టకుండా పంటనంతా కొనాలని రైతులు కోరుతున్నారు.

ఎకరాకు రూ.50 వేల నష్టం

ఎకరాకు రూ.లక్షన్నరపైగా ఖర్చు పెట్టి తేజ రకం సాగు చేస్తే 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంట అమ్మడానికి వెళ్తే ధర క్వింటాల్‌కు రూ.7-8వేల వరకే ఉంది. ఈ ధరకు అమ్మితే రూ.లక్ష నుండి లక్షన్నరలోపే వస్తుంది. సాగు కైన ఖర్చులో మిగతా 50 వేలను నేను నష్టపోవాల్సిందే.

- పూసల సుధాకర్, రైతు, బొప్పూడి.

తాడేపల్లిలో గాలి వాన బీభత్సానికి ఎగిరిపడిన ఇల్లు పైకప్పు, పడిపోయిన చెట్లు, పొంగిపొర్లుతున్న సైడు కాలువ, ఇళ్లలోకి చేరిన నీరు

తాడేపల్లిలో గాలివాన బీభత్సం

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లిలో ఆదివారం ఉదయం ఉరుములు మెరుపులు, పిడుగులతో పాటు వచ్చిన పెను గాలి వాన పట్టణంలో బీభత్సం సృష్టించింది. పోల్కంపాడులో పేదల ఇల్లు పైకప్పు లేచిపోయాయి. పోతురాజు స్వామి గుడి దగ్గర షేక్ సుభాని ఇంటి రేకులు పగిలిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ అధికారులు వెంటనే సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. రన్నింగ్ రూమ్ సెంటర్, ముగ్గురోడ్డు, పోలకంపాడు, కొత్తూరు పెద్ద ప్రాంతంలో పెద్ద ఎత్తున రోడ్డు పక్కన ఉన్నచెట్లు నేలకొరిగాయి. బోటు యార్డు దగ్గర పేదల ఇంటి ముందు కు మురుగునీరు వచ్చి చేరింది. ప్రజలు రోడ్డు మీదకు రావాలంటే ఇక్కడ మోకాళ్ల లోతు నీళ్లలో నడవవలసి వచ్చింది. బైపాస్ పెట్రోల్ బంకు దగ్గర గల తాడేపల్లి అండర్ పాస్ వర్షాపు నీటితో నిండిపోయింది. వాహనాల రాకపోకలకు కొద్దిసేపు ఇబ్బంది కలిగింది. ఇక అపార్ట్మెంట్ ఆవాసాల దగ్గర మురుగు పెద్ద ఎత్తున నిలిచిపోయింది. దీనికి వర్షపు నీరు కూడా తోడవడంతో డ్రైనేజీ పొంగిపొర్లి రోడ్డు మీద పాదసారులు నడవడానికి ఇబ్బంది పడ్డారు. గంటపాటు పెను గాలులు, వర్షంతో తాడేపల్లి అతలా కోతల మైంది.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

గాలి దుమారంలో సైతం కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

శనివారం ఒక్కసారిగా వచ్చిన పెద్ద గాలి దుమారం సైతం తట్టుకొని, దీక్ష శిబిరం పైకప్పు సగభాగం లేచిపోయిన ఏసి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమ దీక్షలు కొనసాగించారు. తమకు న్యాయంగా జరగవలసిన బకాయిలు కోసం కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 152 రోజుకు చేరుకున్నాయి . దీక్షలో టి.దుర్గా భవాని, బి.నవనీతం, ఎం.ఆశీర్వాదం, ఎం.గురవయ్య, బి. సూర్య ప్రకాష్‌రావు కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన తన సమస్యను పరిష్కరించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు తమ ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె.ఖాసిం, బి.అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జయంతి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ, వివిధ సంఘాల నాయకులు

ఉండవల్లిలో ఢీకొళ్ళు చైతన్య ఇంటిని పరిశీలిస్తున్న తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు జంగాల వెంకటేష్

భగీరథ మహర్షికి నివాళి

ప్రజాశక్తి - గుంటూరు

శ్రీ భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ కార్పొరేషన్ డైరెక్టర్ శైలజ, జిల్లా బిసి సంక్షేమ సాధికార శాఖాధికారి కె.మయూరి, సగర సంఘం నాయకులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి దెబ్బతిన్న ఇళ్లకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి

ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లిలో గ్రామ తెలుగు యువత అధ్యక్షులు ఢీకొళ్ళు చైతన్య రేకుల షెడ్డు ఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది. భారీ గాలివానకు ఇంటి పైన రేకు కప్పు మొత్తం గాలికి ఎగిరిపోవడంతో ఇల్లు పూర్తిగా దెబ్బతింది. అలాగే మోజెస్ చెందిన పశువుల పాక పూర్తిగా ధ్వంసం అయింది. విషయం తెలుసుకున్న తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ నారా లోకేష్ ఆదేశాల మేరకు వారి వారి కుటుంబాలను పరామర్శించి సహాయక చర్యలు చేపట్టి ఢీకొళ్ళు చైతన్య కుటుంబానికి 15,000/-వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అలాగే మోజస్ కుటుంబానికి 4000/-వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు దొప్పలపూడి జ్యోతి బస్, రాయపూడి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షికి మంత్రి లోకేష్ నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

సగర భగీరథ సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి గౌతమ్ బుద్ధా రోడ్డులో నిర్వహించిన శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదివారం పాల్గన్నారు. గౌతమ్ బుద్ధా రోడ్డులోని శ్రీ భగీరథ మహర్షి విగ్రహాన్ని సందర్శించి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సగర భగీరథ మహర్షి సంఘం అధ్యక్షులు పి.తిరుపతయ్య, కె.సత్యనారాయణ, జి.వెంకయ్య, జె.రవి, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి నారా లోకేష్, నూతన వస్త్రాల బహూకరణ

రాజధానిలో వర్షం.. పనులకు ఆటంకం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని రోడ్లపై నీరు, మొక్కజొన్నపై కప్పిన టార్పాలిన్ పట్టలు

వర్షం కారణంగా నిలిచిపోయిన జెసిబి,ప్రొక్లయినర్,

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు పరిసర గ్రామాల్లో ఆదివారం ఉదయం వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో 40 నిమిషాల పాటు వర్షం కురవడంతో రాజధాని నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది. శాఖమూరు దగ్గర రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా జెసిబి లతో చేస్తున్న మట్టి తవ్వకం పనులు నిలిచిపోయాయి. కొండవీటి వాగు ఆధునీకరణ కోసం వెలగపూడి వద్ద మట్టి తీత పనులకు సైతం ఆటంకం ఏర్పడింది. దీంతో జెసిబి, ప్రొక్లయినర్ లను తాత్కాలికంగా నిలిపివేశారు. వర్షం కారణంగా రాజధాని నిర్మాణంలో భాగంగా నిర్మించిన కొన్ని రోడ్ల పైకి నీరు చేరింది.విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రైతులు ఉరుకులు పరుగులు..

అకాల వర్షం రైతులను ఉరుకులు, పరుగులు పెట్టించింది. మండలంలో 21 గ్రామాలుండగా (రెండు శివారు గ్రామాలలో కలిపి) కేవలం మూడు గ్రామాల్లోనే పంటల సాగు ప్రక్రియ కొనసాగుతోంది. పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్ర పురం గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాలలో మిర్చి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగవుతున్నాయి. లాండ్ పూలింగ్‌కు భూములు ఇవ్వని రైతులు మొక్కజొన్న, మినుము లాంటి పంటలు పండిస్తు న్నారు. వర్షం కురవడంతో రైతులు పంటల సంరక్ష ణకు చర్యలు తీసుకు న్నారు. రాయపూడి, లింగాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్న పై టార్పాలిన్ పట్టాలు కప్పారు.

వడ్డెర కార్పొరేషన్‌కు 1000 కోట్ల రూపాయలు కేటాయించాలి..

ప్రజాశక్తి - మంగళగిరి

వడ్డెర కార్పొరేషన్‌కు 1000 కోట్ల రూపాయలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర వఅత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.దయాకర్ అన్నారు. ఆదివారం మంగళగిరి వఅత్తిదారుల సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా వడ్డెర వఅత్తిదారుల సంఘం విస్తఅత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టి.శ్రీరాములు అధ్యక్ష వహించారు. దయాకర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కూటమి నాయకులు ఎన్నికలకు ముందు వడ్డెరలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. పరిపాలన 10 నెలలు పూర్తవుతున్నప్పటికీ ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. గుట్టలపై, క్వారీలపై పూర్తి హక్కు వడ్డెర వఅత్తిదారులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసింది గాని ఎలాంటి నిధులు సమకూర్చలేదని విమర్శించారు. వడ్డెరలు సమాజ అభివఅద్ధిలో ఎంతో కీలకమని వారి అభివృద్ధి కొరకు పాలక పార్టీలు ఏమి చేయడం లేదని విమర్శించారు. ప్రతి ఎన్నికల్లోను వడ్డెరలకు అనేక హామీలు ఇస్తారని గెలిచిన తర్వాత మర్చిపోతున్నారని విమర్శించారు. ఆర్థికంగా ఎదగడానికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో అనేక ప్రాజెక్టులు వడ్డెరలే నిర్మించారని అన్నారు. యాంత్రీకరణం వలన వడ్డెరలు పనులు కోల్పోయారని అన్నారు. గుంటూరు జిల్లా వఅత్తిదారుల సంఘం కన్వీనర్ ఈమని అప్పారావు మాట్లాడుతూ అత్యంత పేదరికంలో జీవించే వడ్డెరలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనేకసార్లు గుంటూరు జిల్లాలో ప్రమాదాల గుర్రై మఅతి చెందడం జరిగిందని అన్నారు. వారికి నష్ట పరిహారం చెల్లించటానికి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పనిచేసేటప్పుడు చనిపోతే నష్టపరిహారం 5 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిల్లా వడ్డెర వఅత్తిదారుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.దయాకర్

ఎనిమిది మందితో జిల్లా వడ్డెర వృత్తిదారుల సంఘం ఎన్నిక..

ఎనిమిది మందితో జిల్లా వడ్డెర వృత్తిదారుల సంఘం ఎన్నికైంది. అధ్యక్షులుగా జి.శంకర్, కార్యదర్శిగా టి.శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా వి.తిరుమలేష్, సహాయ కార్యదర్శిగా ఎం.ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా సిహెచ్ సుబ్బరాయుడు, మరో ముగ్గురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా ఎన్నికైన జి.శంకర్ ఘనంగా సత్కరించారు.

ఘనంగా అమ్మవారి ఆలయ పున:ప్రతిష్ట

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని కంతంరాజు కొండూరు గ్రామ శివారులో ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం పున ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు .దాదాపు 6 కోట్ల రూపాయలతో ఈ ఆలయ నిర్మాణం జరిగినది. ఈ కార్యక్రమానిలో రాష్ట్ర విద్య మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించే అమ్మవారికి నూతన వస్త్రాలు బహుకరించారు ఉదయం నుండే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బాలురు తీరారు. దాదాపు పదివేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాలతో గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ దేవ భక్తుని రంగ రంగ ప్రసాద్ ఆలయ ఈవో సునీల్ కుమార్ టిడిపి నాయకులు నందం అబద్దయ్య పోతినేని శ్రీనివాస్ గూడూరు వెంకటరావు షేక్ జబీన్ నిజాముద్దీన్ వెనిగళ్ళ కృష్ణ ప్రసాద్ తోటకూర సీతారామయ్య మండల ఉపాధ్యక్షులు పసుపులేటి సాయి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

జగనన్న కాలనీలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణ సమీపంలో గల జగ నన్న కాలనీలో శనివారం రాత్రి పోలీసులు కార్డన్, సెర్చ్ నిర్వహించారు. ఎస్పి కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కాలనీలో విస్తృత తనిఖీలు చేపట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవా లని ఎస్పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నరసరావుపేట రూరల్ సిఐ పి. రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పాల్గొని జగనన్న కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్ప డే వ్యక్తులను గుర్తించి ప్రజలకు మేమున్నామనే భరోసా నింపేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. నరసరావు పేట వన్‌టౌన్ సిఐ ఎంవి చరణ్, ట్రాఫిక్ సిఐ సిహెచ్ లోకనాథం, వారి సిబ్బందితో కాలనీ పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు కొనసాగించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పూర్తినిఘా ఏర్పాటు చేసినట్టు తెలి పారు. ఇకనుంచి తరచుగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించడంతో పాటు అన్ని ప్రాంతాల్లో తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ జరుగుతుందన్నారు. నేరాలు, ఘర్షణలు నియం త్రణకు పూర్తి స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న బొల్లా బ్రహ్మనాయుడు

రాజధాని రైతులను దగా చేస్తున్న చంద్రబాబు : మాజీ ఎమ్మెల్యే బొల్లా

ప్రజాశక్తి - వినుకొండ

రాజధాని ప్రాంతంలో భూములు ఎవరు కొంటున్నారో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని, రాజధాని రైతులను చంద్రబాబు నాయుడు దగా చేశారని మాజీ ఎమ్మె ల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. ఆదివారం వైసీపీ కార్యాలయం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ అమరావతిలో 29 గ్రామాల రైతులు ధర్నాలు చేస్తే నాడు చంద్రబాబు శభాష్ అని అభినందించారని, ప్రస్తుతం వాళ్ళ పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలని అన్నారు. అమరావతి రాజధాని కోసం 53 వేల ఎకరాలు కాక మరొక 46వేల ఎక రాలు సేకరిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పడం ప్రజలు ఆలోచించాలన్నారు. ఇప్పటికే రాజధాని ప్రాంతంలో బాలకృష్ణ, టీవీ5 బిఆర్ నాయుడు, ఏబీఎన్ వాళ్లు, భ్రమరా రియల్ ఎస్టేట్ సమస్త అక్కడ భారీగా భూములు కొన్నారని ఆయన ఆరోపించారు. మొన్నటి వరకు ధర్నా చేసిన రైతుల పరిస్థితి ప్రస్తుతం అంధకారంగా మారిందన్నారు. రాష్ట్రంలో రైతులు పండిం చిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు లబోదిబోమంటున్నారని అన్నారు. వినుకొండ నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలు పెన్షన్లు తొలగించారని, వృత్తిలో వికలాంగులకు పార్టీని ఆపాదించి పింఛన్లు తీయించడం దారుణ మన్నారు. తొలగించిన పెన్షన్లను లబ్ధిదారులకు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఇప్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. సోమవారం సాయంత్రంలోగా పెన్షన్లు తిరిగి ఇప్పించకపోతే మంగళవారం వినుకొండ పట్టణం శివయ్య స్థూపం వద్ద ధర్నా నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. సమావేశంలో వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యాలకు దూరంగా చెత్త సంపద కేంద్రాలు

పాక్షికంగా పని చేస్తున్న యంత్రాలు ... మూలనపడ్డ చెత్త సేకరించే రిక్షాలు

నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరించే రిక్షాలు

వర్మీ కంపోస్టు కేంద్రం

చెత్త నుండి సంపద సృష్టి కేంద్రం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

చెత్త నుండి సంపద తయారు చేయాలనేది ప్రభుత్వం ఆలోచన.. అందుకనుగుణంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయితీలో సంపద కేంద్రాలని ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వం ఆశించిన ప్రయోజనాలను పొందలేక, లక్ష్యానికి దూరంగా సంపద కేంద్రాలు పని చేస్తున్నాయని చెప్పవచ్చు.

2014-19 మధ్య తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్న సమయంలో స్వచ్ఛభారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు పరిశుభ్రత, పచ్చదనంపై దృష్టిసారించారు. దానిలో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం నిధులు ఖర్చు చేశారు. జనాభా ఆధారంగా ఒక్కో కేంద్రానికి రూ. 3 నుండి రూ. 8 లక్షలు వరకు వెచ్చించారు. మాచర్ల నియోజకవర్గంలో 77 పంచాయితీలుండగా 70 పంచాయతీ గ్రామాల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. చెత్త సేకరించటానికి బ్యాటరీ బండ్లు, రిక్షాలు సమకూర్చారు. చెత్త సేకరించటానికి హరిత రాయబారులను నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం హరిత రాయబారులకు క్లీన్ మిత్రలుగా పేరు మార్చింది. వీరికి నెలకు రూ. 6 వేలు వేతనం నిర్ణయించింది. తొలుత కేంద్రమే వేతనాలు చెల్లించి ఆనక చేతులెత్తేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి జగనన్న స్వచ్ఛ సంకల్పంగా పేరు మార్చినప్పటికీ ఆ సంకల్పం నెరవేరలేదు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చెత్త తరలింపు వాహనాలను పంచాయతీలకు ఇచ్చారు. అయితే కేంద్రాల నిర్వహణలో చిత్తశుద్ధి కొరవడటంతో నిరూపయోగంగా మారాయి. చెత్తసేకరించే వాహనాలు తుప్పు పట్టి చాలా చోట్ల మూలకు చేరాయి. తిరిగి అధికారం చేపట్టిన టిడిపి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పగించింది. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించడానికి గ్రీన్ అంబాసిడర్లను నియ మించుకుని, వారికి పంచాయతీలే వేతనాలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. మాచర్ల నియోజకవర్గంలో పిచ్చిమొక్కలు మొలిచి నిరూపయోగంగా వున్న కేంద్రాలను బాగు చేయించి, కొత్త రంగులు వేశారు. కొన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో, మరికొన్ని పాక్షికంగా పనిచేస్తుండగా, ఇంకొన్ని అసలు పనిచేయటం లేదు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఇలా పనిచేస్తాయి

గ్రామాల్లో వెయ్యి జనాభా లేక 250 కుటుంబాలకు ఒక క్లీన్ మిత్ర ఉంటారు. వీరు రిక్షాలతో రోజు గానీ రెండ్రోజులకోసారి గానీ వీధుల నుంచి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తారు. తడి, పొడి చెత్తతోపాటు గోనె సంచులు, పాతబట్టలు, చెప్పులు, గాజు, పెంకు, ఇనుము, ప్లాస్టిక్‌లుగా వేరు చేస్తారు. వాటిని వేర్వేరు తొట్టెలతో వేస్తారు. తడి చెత్తను కుళ్లించి, వానపాములతో నిబంధనల ప్రకారం సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు కిలో రూ. 10కు విక్రయిస్తారు. సేకరించిన పొడి వస్తువులను రిసైకిలింగ్‌కు కొరకు విక్రయిస్తారు. సంపద కేంద్రాల నిర్వ హణకు నెలకు సుమారు రూ. 30వేలు వరకు ఖర్చు అవుతోంది.

సంపద తయారీ కేంద్రాల ప్రధాన లక్ష్యాలు

మేజర్ పంచాయతీల్లో సుమారు రెండు టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. డంపింగ్ యార్డులు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ చెత్తను, వ్యర్థపదార్థాలను పడవేస్తుండటంతో గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొని, కాలుష్యం పెరిగి ప్రజలు అనేక రోగాల బారినపడి ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంచాయతీలు చెత్తను కాల్చి బూడిద చేస్తున్నాయి. దీనివల్ల చెత్త సమస్య తగ్గినా, విషవాయువులు గాలిలో కలిసి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోంది. రైతులు రసాయనిక ఎరువులు వాడకం ద్వారా ఖర్చులు పెరిగి, భూసారం తగ్గి, ఆశించిన దిగుబడులు రాక నష్ట పోతున్నారు. చాలా పంచాయితీలకు ఆదాయం తక్కువగా వుంటుంది. గ్రామ పారిశుధ్యం కోసం పనిచేసే కార్మికులకు జీతాలు చెల్లించలేదని పరిస్థితి వుంటుంది. ఈ పరిస్థితులు నివారించటానికి గ్రామాల్లో చెత్తను సేకరించి, దానిని నాణ్యమైన సేంద్రీయ ఎరువుగా మార్చి, రైతులకు విక్ర యించటం ద్వారా రైతుల ప్రయోజనాలు కాపాడటం. వర్మీ కంపోస్టు అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో కార్మికుల వేతనాలు చెల్లించాలనేది ప్రభుత్వ ఉద్దేశం.

లక్ష్యాలకు దూరంగా సంపద తయారీ కేంద్రాలు

అనుకున్న లక్ష్యాలను చేరుకోవటంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు విఫలమవుతున్నాయి. చెత్త సేకరించే వాహనాలు చాలా వరకు మూలనపడ్డాయి. కొన్ని సంపద తయారీ కేంద్రాలు గ్రామానికి దూరంగా ఉండటం చేత అక్కడికి చెత్త తీసుకురావటం సమస్యగా మారింది. కార్మికుల వేతనం రూ.6వేలే కావటంతో అవి సరిపోక పనిచేసేందుకు ఎవరు ముందుకు రావటంలేదు. పొడి చెత్త దాదాపు రావటం లేదు. ప్లాస్టిక్, అట్టపెట్టెలు, ఇనుము వంటి వస్తువులను ప్రజలు ఉల్లిపాయలకు వేస్తుండటంతో దానిపై ఆదాయం లేకుండా పోయింది. వానపాములు తరుచూ చనిపోవటం, తడిచెత్త నుండి తయారు చేస్తున్న వర్మీకం పోస్టు అంతగా నాణ్యతగా ఉండటం లేదు. తయారు చేసిన సేంద్రీయ ఎరువును కొనేందుకు రైతులు ముందుకు రావ టం లేదు. కొన్ని కేంద్రాలు మాత్రమే పూర్తిస్థాయిలో, మిగి తావి పాక్షికంగా పనిచేస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

లక్ష్యాలను అందుకోవాలంటే..

అనుకున్న లక్ష్యాలను చేసుకోవాలంటే పంచాయతీ పాలకవర్గాలు, అధికారులు, పారిశుధ్య సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలి. ప్రజలకి పారిశుధ్యంపై అవగాహన పెంచి చెత్తను క్లీన్‌మిత్రకు అందేలా చూడాలి. చెత్త తరలించే వాహనాలు మెరుగైన స్థితిలో ఉండాలి. తడి, పొడి చెత్త, ప్లాస్టిక్, గాజు సీసాలు, ఐరన్, ఇతర వ్యర్థాలు అన్నీ కలిసి సంపద కేంద్రాల వద్దకు వస్తుంటాయి. వీటిని వేరు చేసి కంపోస్టు తయారీకి అవసరమైన వ్యర్థాల సేకరణకు సరి పడా సిబ్బందిని నియమించుకోవాలి. సంపద తయారీ కేంద్రాల కింద పనిచేసేవారి వేతనాలు కనీసం రూ.12 వేలుకు పెంచాలి. వేగంగా కంపోస్టు చేసే వానపాము రకాలను అందివ్వాలి. కేంద్రాల్లో తయారైన వర్మీ కంపోస్టు కొనుగోలు చేసిన వారు తిరగి అమ్ముకొనేందుకు మార్కెట్ సదుపాయం కల్పించాలి. రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించి, తప్పనిసరిగా వర్మీ కంపోస్టు వినియో గించే విధంగా చూడాలి. అప్పుడే ప్రభుత్వం ఆశించిన ప్రయోజనాలు చేకూరి, చెత్త నుండి సంపద సృష్టి జరుగుతుంది.

ప్రజల దాహార్తి తీరుస్తున్న వైద్యుడు

నిర్విరామంగా కొనసాగుతున్న ఉచిత మంచి నీటి చలివేంద్రం

సింగరాజు వెల్ఫేర్ సొసైటీకి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రజలు

తాగునీటిని వినియోగించుకుంటున్న ప్రజలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రస్తుత రోజులలో ఉచితంగా తాగునీరు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. దాహం వేస్తే మంచి నీరు లీటరు బాటిల్ రూ.20లు పెట్టి కొనుగోలు చేసి తాగా ల్సిందే. పేద ప్రజలు రైతులు అంత ఖర్చు చేసి బాటిల్ కొనుగోలు చేసి తాగగలరా అనే ఆలోచనల నుండి వెలసిందే సింగరాజు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన శాశ్వత ఉచిత మంచి నీటి చలివేంద్రం. తాగు నీరు కొనుక్కొని తాగాల్సిన పరిస్థితులలో వేసవిలో ఎండిపోయిన గొంతులకు ఉపశమనం కల్పించి ప్రజల మన్ననలు పొందుతున్నారు. అనన్య హాస్పిటల్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ సొంత లాభం కొంత మానుకొని పొరుగు వానికి సాయపడవోయ్ అన్న మహాకవి గురజాడ స్పూర్తితో వైద్యులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ప్రజల దాహర్తిని తీర్చేందుకు ముందుకు వచ్చారు. వేసవిలో తాత్కాలికంగా చలివేంద్రాల ఏర్పాటుకు విరుద్ధంగా డాక్టర్ సాయికృష్ణ నిత్యం ప్రజల దాహర్తి తీర్చాలని సంకల్పంతో పల్నాడు బస్టాండ్ లోని వైద్యశాల ముందు సింగరాజు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శాశ్వత ప్రాతిపదికన చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఇందుకు శుద్ధజలం యంత్రం ఏర్పాటుకు రూ.5లక్షలు వరకు వెచ్చించారు. పల్నాడు ప్రాంతానికి ముఖ ద్వారం అయిన నరస రావు పేట పట్టణంలోని పల్నాడు బస్టాండ్‌లోని హాస్పిటల్ ఎదుట మూడేళ్ల నుండి నిత్యం ఉచిత తాగునీటి పథకాన్ని 24 గంటలు కొనసాగిస్తు న్నారు. పల్నాడు బస్టాండ్‌లో అనేక హెూటల్‌లో చిరు వ్యాపారాల నీటితో వ్యాపారాలు సాగిస్తున్నారు. హాస్పిటల్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వ హిస్తూ ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

వివేకానంద చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు ప్రారంభం

ప్రజాశక్తి - మాచర్ల

శ్రీ రామకృష్ణ సేవా సమితి మాచర్ల వారి ఆధ్వర్యంలో శ్రీశైలం రోడ్‌లోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో స్పోకెన్ ఇంగ్లీష్ మరియు నైతిక, ఆధ్యాత్మిక విలువల క్లాసులను శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ప్రారంభించారు. ముందుగా మెట్టు గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలు వేశారు. ఈ సందర్భంగా గోవింద రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద స్పూర్తితో విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌తో పాటు నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించాలని సంకల్పంతో ఈ ఉచిత క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోజు సాయంత్రం 6 గంటల నుండి 7.30 వరకు ఉంటుందని, ఈ ఉచిత శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉచిత కోచింగ్ ఇస్తున్న విరువంటి శ్రీనివాస్, ఈశ్వరరావు మాస్టర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజధానిలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని గ్రామాల్లో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి.రాజధాని నిర్మాణ పనులు మొదలు కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువయ్యాయి.దీంతో ప్రధాన సెంటర్లలో ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయని స్థానికులు చెబుతున్నారు. వాహనాల రద్దీ వల్ల రోడ్డు దాటాలంటే కష్టంగా మారిందని వాపోతున్నారు. నిర్మాణ సామగ్రితో వచ్చే వాహనాలతో పాటు ఇసుక లారీలు,ట్రాక్టర్లు,స్కూళ్ళు,యూనివర్సిటీ ల బస్సులు పెద్ద సంఖ్యలో రాజధానికి వస్తుంటాయి. సచివాలయంకు గుంటూరు పరిసర గ్రామాల నుంచి ఉద్యోగులు,రియల్ ఎస్టేటర్లు కార్లు, ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో రద్దీ ఎక్కువైంది. ఉదయం, సాయంత్రం రద్దీ మరింత ఎక్కువగా ఉంటోంది.

నియంత్రణకు చర్యలేవి..?

రహదారులకు ఇరుపక్కలా ఇష్టారాజ్యంగా వాహనాలను నిలిపి ఉంచడం కూడా ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవు తోందని అంటున్నారు. పెదపరిమి, తుళ్లూరు, మందడం సెంటర్లలో రోడ్డు దాటడం గగనమై పోతోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రధానగా వఅద్ధుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని చెబుతున్నారు. ఎవరో ఒకరు చెయ్యిపట్టుకొని రోడ్డు దాటించ వలసిందే. 2015 - 19 వరకు రాజధానిలో రోడ్డు ప్రమాదాలలో పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారని రాజధాని వాసులు గుర్తుచేస్తున్నారు.

కనపడని ట్రాఫిక్ పోలీసులు..

రాజధానిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనపడడం లేదని రాజధాని వాసులు అంటున్నారు.రద్దీ ఎక్కువగా ఉండే చోట కనీసం ఒక్క పోలీసు కూడా కనిపించడం లేదని చెబుతున్నారు. వెంటనే ట్రాఫిక్ పోలీసులను నియమించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదలపై అవగాహన ఏది..?

రాజధానిలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.రానున్న రోజుల్లో రాజధానిలో ట్రాఫిక్ మరింత పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ట్రాఫిక్ నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం అవసరమన్న అభిప్రాయాన్ని రాజధాని గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సంస్థల ప్రతినిధులు, వ్యాపార దుకాణదారులు, వాహనదారులతో సంబంధిత అధికారులు అవగాహన కోసం సమావేశం నిర్వహించాలని కోరుతున్నారు.

ధార్మిక విద్య అవసరమే

ప్రజాశక్తి- తాడేపల్లి

ధార్మిక విద్య కూడా అవసరమేనని మన్సూ రుద్దిన్ అహ్మద్ చెప్పారు. తాడేపల్లి పట్నంలోని నులకపేట సిద్ధిక్ నగర్, జామియా దారుల్ బీర్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ (మదర్సా) 15 వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. విద్య రెండు రకాలని, ఒకటి ప్రాపంచిక విద్య, మరొకటి ధార్మిక విద్య అని వివరించారు. ధార్మిక విద్యను ప్రతి ముస్లిం తప్పనిసరి విధిగా భావించాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన ఖురాన్- హదీస్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షేక్ అబ్దుల్లా, షాహిద్, ముర్తుజా, ఇలియాస్, ఫయాజ్ ఆలం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అనంతరం సంతోషంగా ఉండాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

పదవీ విరమణ అనంతరం ఆయుష్ ఆరోగ్యాలతో సంతోషంగా ఉండాలని దుగ్గిరాల సర్పంచ్ బాణావత్ ఖుషి బాయ్ అన్నారు. స్థానిక సుగాలి కాలనీకి చెందిన బాణావత్ హూ నా నాయక్ రైల్వే శాఖలో 36 సంవత్సరాలు సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి రిమార్కులు లేకుండా పదవి విరమణ చేసినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బాణావత్ వెంకటేశ్వర నాయక్ ప్రకాష్ నాయక్ సాంబయ్య నాయక్, హూనా నాయక్ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

వేసకాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్ర తల వలన గర్భిణులు, బాలింతలు డిహైడ్రేషన్, వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పిహెచ్సి వైద్యురాలు సి.ఇందిర అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా ఆహార నియమాలు పాటించాలి అధిక ఉష్ణోగ్రత ఉన్న సమయంలో బయట తిరగవద్దు అన్నారు. అధిక నూనెలు మసాలాలు వేడి చేసే పదార్థాలు కూల్డ్రింకులు కాఫీ టీ తగ్గించి తేలికగా జీర్ణమయ్యే ఆకు కూరలు పండ్లు కూరగాయలు కొబ్బరి నీరు మజ్జిగ తరచుగా నీరు తీసుకోవాలన్నారు. వాతావరణానికి తగినట్లుగా తేలికపాటి కాటన్ దుస్తులు ధరించాలన్నారు. అవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దన్నారు తలనొప్పి జ్వరం వాంతుల బారిన పడినట్లయితే వెంటనే వైద్యుని సంప్రదించాలని సలహానిచ్చారు. గర్భిణీలు గర్భంలో ఉన్న శిశువు కూడా సరిపోయేటట్లుగా బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సలహానిచ్చారు. ప్రసవం అనంతరం బయటపదార్థాలు తీసుకోవద్దని కలుషిత ఆహారం అయ్యే ప్రమాదం ఉందన్నారు. తేలికపాటి వ్యాయామంతో పాటు మధ్యాహ్నం పూట కొంతసేపు నిద్రతో విశ్రాంతి తీసుకోవాలని సలహాలు ఇచ్చారు పిల్లలను ఎండ సమయంలో బయటకు తిరుగుకుండా బయటపదార్థాలు తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రైతులకు అందుబాటు ధరలో నాణ్యమైన ట్రాక్టర్లు

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రజాశక్తి - పెదకాకాని రైతులకు అందుబాటు ధరలో నాణ్యమైన ట్రాక్టర్లు అందించే లక్ష్యంతో వారాహి మోటర్స్ ప్రారంభించటం జరిగిందని పార్టనర్స్ కొంగర అభిలాష్ చౌదరి, పర్చూరి కమలేంద్ర బాబు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఆటోనగర్లో వారాహి మోటార్స్ వారు ఐచర్ ట్రాక్టర్ షోరూంను ఆ సంస్థకు చెందిన ఎపి అసోసియేట్ జనరల్ ప్రెసిడెంట్ సోమశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రమేష్ నాయుడు మాట్లాడుతూ ఐచర్ దేశంలోనే మొదటి ట్రాక్టర్ సంస్థ అని నేటికీ 20 లక్షల ట్రాక్టర్లు వివిధ రంగాలలో ప్రజలకు ఉపయోగపడు తున్నాయని అన్నారు.ఈ టాక్టర్స్ వలన రైతులకు అనేక ఉపయోగాలు ఉన్నాయని రాజధాని నిర్మాణంలో కూడా ట్రాక్టర్లను అన్ని విధాలుగా ఉపయోగించుకోవచ్చునని,

మాట్లాడుతున్న వారాహి మోటార్స్ పార్టనర్లు

31 మండలాలు వారాహి మోటర్స్ పరిధిలో ఉన్నాయని ధర తక్కువ తో పాటు రైతులకు లో మెయింటినెన్స్ కలిగి ఉంటాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అరవై తొమ్మిది బ్రాంచ్ లు ఉన్నాయని రిపేరు వస్తే మొబైల్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పారిశ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యులో యూనివర్సిటీ ప్లేస్మెంట్ సక్సెస్ మీట్

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎంటిఎంసీ పరిధిలోని కెయల్ యూనివర్సిటీ ప్లేస్ మెంట్ సక్సెస్ మీట్ శనివారం రాత్రి కె ఎల్ యూ లో జరిగింది.ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా మైనింగ్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల్లో ప్లేస్ మెంట్ సాధించిన విద్యార్థులుకు మంత్రి సర్టిఫికేట్‌లు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కెయల్ యూనివర్సిటీ అంటే ఒక సక్సెస్‌కు చిరునామా అని అన్నారు. యూనివర్సిటీలో అడుగు పెట్టిన నాటి నుంచే క్రమశిక్షణ అలవడుతుందని నేడు ఇక్కడ చదివిన ఆరువేల మందికి ప్లేస్ మెంట్ అంటే చిన్న విషయం కాదని అన్నారు.వంద శాతం ప్లేస్ మెంట్ సాధించడం విద్యార్థులు ప్రతిభ కు నిదర్శనమని అన్నారు.సియం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లు విద్య కు ఎంతో ప్రాధా ఇస్తున్నారని అన్నారు.నూతన విద్యా విధానం ద్వారా లోకేష్ యువత లో ఉన్న ప్రతిభ ను వెలికి తీస్తున్నారని స్కిల్ సెన్సెన్స్ ను తయారు చేసేలా నూతన విధానాలు అమలు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు వంటి విజనరీ నేత సిఎంగా ఉండటం మనందరి అదఅష్టమని అన్నారు.గతంలో ఐటీ అంటే చంద్రబాబు ను చులకనగా మాట్లాడారని నేడు ఏ దేశానికి వెళ్లినా ఐటిలో మన తెలుగు వారు సత్తా

వివిధ కంపెనీల్లో ప్లేస్ మెంట్ సాధించిన విద్యార్థులు కు సర్టిఫికెట్‌లు అందజేసిన మంత్రి, సక్సెస్ మీట్ లో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

చాటుతున్నారని అన్నారు. విజన్ 2020 అంటే అదేంటి అన్నారు.. ఇప్పుడు హైదరాబాద్ చూసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.క్వాంటం వాలీ కి మన ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.ఇప్పుడు అర్థంకానివారు వాటి ఫలితాలు అద్భుతంగా ఉంటాయని చంద్రబాబు పాలనను స్ఫూర్తి గా తీసుకున్నా అని మోడీ స్వయంగా చెప్పారంటే... అది చంద్రబాబు పని తీరుకు నిదర్శనమని అన్నారు. నేడు సక్సెస్ సాధించిన విద్యార్థులు ఎక్కడ ఉన్నా.. మన రాష్ట్రానికి సేవలు అందించాలని అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టు లను పూర్తి చేసి నీటి సమస్యలు తీర్చేలా చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. మైనింగ్‌లో కూడా అనేక సంపద మన దగ్గర ఉందని ఖనిజ సంపద ను వెలికి తీస్తే ధనిక రాష్ట్రంగా ఏపీ అభివృద్ధి చెందుతుందని అన్నారు. విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేసేలా మా ఆలోచనలు ఉన్నాయని విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ ను వెలికి తీయడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకుంటారని అన్నారు. 2025 విద్యాసంవత్సరంలో నూరు శాతం క్యాంపస్ ప్లేసెమెంట్స్ సాధించిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సెలర్స్ డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, ప్లేసెమెంట్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎన్.బి.వి.ప్రసాద్, నైపుణ్యాభివఅద్ధి విభాగం డీన్ డాక్టర్ శ్రీనాథ్, అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు, డాక్టర్ సుమన్, డాక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కోటేశ్వరరావు

శివ భక్త బృందం అన్నదానం...

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం వద్ద శివ భక్త బృందం ఆధ్వర్యంలో ప్రతి నెల జరిగే అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బోగి కోటేశ్వరరావు భక్త బఅందం ప్రతినిధులు మన్నెం రమేష్ బాబు, అనిత, గుండా రామాంజనేయులు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న పేద అనాథ మాతృ సేవా సంక్షేమ సంఘం సభ్యులు

అన్నదాన కార్యక్రమం

ప్రజాశక్తి - మంగళగిరి

పేద అనాథల మాతృ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లింగనేని శ్రీరామ్మూర్తి,ఉపాధ్యక్షులు సాధరబోయిన నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన వెంకట నరసయ్య, కార్యదర్శి పేరం పూర్ణచంద్ర రావు, కోశాధికారి యన్నం శివ నాగేశ్వరరావు, ముద్రబోయిన హనుమంతరావు, కోట్ల శ్రీను, యన్నం స్నేహ, గుర్రాల పండు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి : తాడికొండ

స్థానిక రావిచెట్టు సెంటర్ వద్ద ఉన్న నార్త్ స్కూల్ నందు బండ్ల కోటేశ్వరరావు మిత్రమండలి సారధ్యంలో శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరంను ఆదివారం నిర్వహించారు. శిబిరంలో 98 మంది కంటి పరీక్షలు చేయగా వారిలో 54 మందికి కంటి శుక్లములు గుర్తించి శంకర ఆసుపత్రికి తీసుకుని వెళ్లి ఆపరేషన్ ఉచితంగా చేయబడుతుందని నిర్వాహకులు తెలియజేసారు. చికిత్సకు సోమవారం ఉచిత బస్సు సౌకర్యంతో రావి చెట్టు సెంటర్ వద్ద నుండి తీసుకువెళ్లి ఆపరేషన్ చేసి మరల అక్కడే తీసుకొచ్చి వదిలి పెడతారని తెలియజేసినారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరరావు ,దనేకుల హరిబాబు ,నీలాద్రి వెంకటేశ్వరరావు, కోలికపూడిసామేలు, కాసింశెట్టి పున్నయ్య, చింతల భాస్కరరావు, పాల్గొన్నారు.

మండల, డివిజన్ స్థాయిలోనూ గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జిల్లా కేంద్రంతోపాటు మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలోనూ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలుగానీ, మున్సిపల్ కార్యాలయాల్లో అందచేయాలన్నారు. ప్రజలకు పాలన మరింత చేరువ చేయటానికి ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను వికేంద్రీకరించినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నేడు జిఎంసి డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సమస్యల పరిష్కారం కోసం గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నేడు ఉదయం 9:30 నుండి 10:30 గంటల వరకు గుంటూరు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు 0863-2224202 నంబర్‌కు ఫోన్ చేసి, తమ ఫిర్యాదులు తెలియజేయొచ్చన్నారు. అనంతరం గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరిచంటం జరుగుతుందన్నారు.

6న డాక్టర్ కొండబోలు బసవపున్నయ్యకు జీవన సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

గుళ్లపల్లి సుబ్బారావు సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన సాయంత్రం 6 గంటలకు స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై ప్రముఖ వైద్యులు, విద్యాప్రదాత డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య 93వ పుట్టినరోజు సందర్భంగా జీవన సాఫల్య పురస్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా సంస్థ కన్వీనర్ గుళ్లపల్లి రాఘవేంద్రరావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ వ్యవహరిస్తారన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణయ్య, డాక్టర్ యర్ర నాగేశ్వరరావు, పురస్కార గ్రహీత పరిచయం మోదుగల రవికృష్ణ చేస్తారన్నారు. నిఘంటు నిర్మాత పెద్ది సాంబ శివరావు మెడికల్ డిక్షనరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ రాఘవేంద్రరావు తెలిపారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2025-2026 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని మైనారిటీస్ లబ్ధిదారులకు (ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పారశీకులు) సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మైనార్టీ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ రోషన్ జమీర్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు స్లాబ్‌లలో ఈ రుణాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. మొదటి స్లాబ్‌లో కిరాణాషాప్, పాన్‌షాప్, చికెన్ అండ్ మటన్ షాప్, ఫ్రూట్స్ స్టాల్స్, కూరగాయలు, ఎలక్ట్రికల్ రిపేర్లు, సైకిల్ షాప్ మొదలగు పథకాలకు రూ.1లక్ష వరకు రుణ సదుపాయం కల్పించటం జరుగుతుందన్నారు. అలాగే రెండో స్లాబ్‌లో ఏసీ, ఫ్రిడ్జ్ రిపేర్లు, ఆటోమొబైల్ స్పేర్స్ యూనిట్‌లు, బ్యాటరీ సర్వీసింగ్, సేల్స్, సెల్‌ఫోన్ రిపేరు, సేల్స్, ఫుట్‌వేర్ షాప్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ మొదలైన పథకాలకు రూ.1లక్ష నుండి రూ.3 లక్షల వరకూ రుణం అందుతుందన్నారు. మూడవ శ్లాబ్ కింద ఆటోమొబైల్ రంగం, రవాణ రంగం, ఫాబ్రికేషన్ తదితర యూనిట్లు ఏర్పాటుకు రూ.3 లక్ష నుండి రూ.5 లక్షల వరకూ, నాల్గవ శ్లాబ్ కింద ఆటోమొబైల్ రంగం, జనరిక్ మెడికల్ దుకాణాలు, ఫిట్‌నెస్ సెంటర్లు ఏర్పాటుకు రూ.8.00 లక్షల వరకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. 21 ఏళ్ల నుండి 55 సంవత్సరాల వయస్సు ఉండి, వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు ఉండాలని, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థి పాస్ పోర్ట్ సైజు ఫోటో 1,రవాణ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు డ్రైవింగ్ లైసెన్స్ జత చేయాలన్నారు. కావున జిల్లాలో ఆసక్తి ఉన్న వారు మే 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, సంబంధిత సర్టిఫికేట్లు జతచేసి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి/ మునిసిపల్ కమిషనర్‌కు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు ఆఫీసు పనివేళల్లో 9849901142, 9652960367 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభంలో పాల్గొన్న మేయర్, ఇతర నాయకులు

జూట్‌మిల్లు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన మేయర్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక 35వ డివిజన్ పరిధిలోని జూట్‌మిల్లు వద్ద స్థానిక కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నగర మేయర్ కోవెల మూడి రవీంద్ర స్థానిక పెద్దలతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చటానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈరంటీ వరప్రసాద్ సామాజిక సేవా కార్యక్రమాలు చేయటంలో ముందుంటారన్నారు. డివిజన్ల వారీగా, స్థానిక టిడిపి నాయకుల ఆధ్వర్యంలో నగరంలో మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అన్వర్, శేఖర్, మస్తాన్, జానీ, గోపి, శ్రీకాంత్, షేక్ సుభాని, పోపూరి నరేంద్ర, నజీర్, శ్రీదేవి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూతనిస్తాం

ఉపకరణాల పంపిణీకి నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు - వృద్ధులకూ అందిస్తాం

ప్రజాశక్తితో జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారిణి సువార్త

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వికలాంగులకు ఉపకరణాల పంపిణికి సోమవారం నుంచి వారం రోజులపాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు వికలాంగులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి సిహెచ్. సువార్త తెలిపారు. ఈ అవకాశాన్ని వికలాంగులతో పాటువృద్ధులకు కూడా ఉపయోగించుకోవచ్చునని చెప్పారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలు తెలియజేశారు.

ప్రత్యేక శిబిరాలు ఎక్కడ నిర్వహిస్తున్నారు?

వికలాంగులు, వృద్ధుల కోసం ఈనెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జిల్లాలోని ఏడు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహిస్తున్నాం. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత ఎంపిడివో, మునిసిపల్ అధికారులకు తెలియజేశారు. వారి ఆధ్వర్యంలోనే ఈశిబిరాలు జరుగుతాయి.

శిబిరాల ఉద్దేశ్యం ఏమిటీ?

బిపిఎల్ తరగతికి చెందిన వికలాంగులు, వయోవృద్ధులకు ఆర్టిఫిషియల్ మ్యాన్యు ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హైదరా బాద్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సహకారంతో ఉపకరణాలు, సహాయ పరిక రాలను ఉచితంగా అందించేందుకు అర్హులను గుర్తించేందుకు ఈ శిబిరాలు ఏర్పాటు చేశాం

ఉపకరణాలకు ఎవరు అర్హులు?

దారిద్రరేఖకు దిగువన ఉన్న వారు, భౌతిక అవసరాలను బట్టి సహాయక ఉపకరణాలు వినియోగించండం తప్పనిసరి అయిన వారు, 40 శాతం పైన వైకల్యం ఉన్నవారు, అర్హతను బట్టి ఒకటి కంటే ఎక్కువ ఉపకకరణాలు అవసరం అయిన వారికి అందిస్తారు. ప్రధానంగా బియ్యం కార్డు ఉన్న వారు అర్హులుగా నిర్ధారించారు.

వికలాంగులు తీసుకురావాల్సిన ధృవపత్రాలు?

సదరం వైద్య ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, యూనిక్ డిజైబుల్ కార్డు (యూడిఐడి),. రెండు ఫోటోలు, వారి ఫోన్ నెంబరు తప్పని సరిగా దరఖాస్తుతో జతచేయాలి.

వృద్ధులకు కావాల్సిన అర్హతలు?

60 ఏళ్ల దాటిన వారు, బియ్యం కార్డు ఉన్న వారు, భౌతిక అవసరాలకు తగ్గట్టుగా ఉపకరణాలు వినియోగం తప్పని సరైన వారు, ఒకటి కంటే ఎక్కువ ఉపకరణాలు అవసరం అయితే గుర్తించేందుకు ఈశిబిరాలు ఏర్పాటు చేశాం. వృద్ధులు కూడా ఆదాయ ధృవీకరణ పత్రం, బియ్యం కార్డు, రెండు ఫోటోలు, వారి ఫోన్ నెంబరు నమోదు చేయాలి. ప్రతి ఒక్కరూ ఓరిజనల్, జిరాక్సు కాపీలు రెండు తేవాలి.

ఉపకరణాలు ఎప్పుడు ఇస్తారు?

వికలాంగులు, వృద్ధులకు ఎవరికి ఏ పరికరం అవసరమో గుర్తింపునకు ఎంపిక చేయడం ఈ శిబిరం ఉద్దేశ్యం. ఈ శిబిరంలో గుర్తించిన వెంటనే ఉపకరణాలు ఇవ్వం. గుర్తింపు పొందిన లబ్ధిదారులకు తరువాత పంపిణీ తేదీ, ప్రదేశం తెలియజేస్తాం. ఈశిబిరానికి వచ్చే వారికి, ప్రభుత్వం అందించే ఫించన్ల మంజూరుకు సంబంధం లేదు.

శిబిరాలు జరిగే ప్రదేశాలు?

5వ తేదీన సోమవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయం (తాడికొండ నియోజకవర్గం వారికి), 6న మంగళగిరి నియోజకవర్గం వారికి మంగళగిరి మునిసిపల్ కార్యాలయం వద్ద ఈద్గా కమ్యూనిటీ హాలు వద్ద, 7న పొన్నూరు ఇండోర్ స్టేడియం, 8న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం, 9న ప్రత్తిపాడు ఎంపిడివో ఆఫీసు, 12న గుంటూరు పశ్చిమ వారికి ఎన్‌టిఆర్ స్టేడియంలో, 13న గుంటూరు కొత్తపేట ఉర్దూ హైస్కూలు (గుంటూరు తూర్పు నియోజకవర్గం)లో శిబిరాలు జరగనున్నాయి.

సెయింట్ ఆన్స్‌లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఎంబిఎ 2008-2010 రెండవ బ్యాచ్ విద్యార్థులు పీజీ పూర్తి చేసుకొని పదిహేను సంవత్సరాలు అయిన సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కళాశాలతో, తోటి మిత్రులతో, అధ్యాపకులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య పూర్వ విద్యార్థులను అభినందించారు. ప్రొఫెసర్ డాక్టర్ పి.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను అనుభవాలను తీసుకొని, ప్రస్తుత విద్యార్థులు వారి ఉన్నతికి బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ జి.రాధిక, పూర్వ అధ్యాపకురాలు డాక్టర్ ఎం.నాగలక్ష్మి, పూర్వ విద్యార్థుల కమిటీ కన్వీనర్ సరోజ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో

చిన్నపిల్లలకు ఈతలో శిక్షణ

ప్రజాశక్తి- తాడేపల్లి

ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్అసోసియేషన్ ఆధ్వర్యములో చిన్న పిల్లల ఈత శిక్షణా శిబిరం లైలా గంగరాజు నగర్, అమరావతి కరకట్ట రోడ్డులో గల శ్రీ గోకరాజు గంగరాజు గెస్ట్ హౌస్ స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం అసోసియేషన్ లైఫ్ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గత 17 సంవత్సరాలుగా పిల్లలకు పిల్లలకు ఈతలో శిక్షణ ఇస్తున్నామన్నారు. స్విమ్మింగ్ పూల్‌లో దాదాపు 200 మంది పిల్లలకు ఈత నేర్చుకునేందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. చిన్న వయసు నుండే ఈత నేర్చుకున్నాట్లయితే జీవితము ఎంతో ఆత్మ విశ్వాసముతో ముందుకు సాగుతారని వివరించారు. ఈత నేర్చుకోవటము వలన నదిలో స్నానములు చేసేటప్పుడు ఎటువంటి ప్రమాదములకు గురి కాకుండా తమని తాము రక్షించుకోవచ్చని తెలిపారు. ప్రమాదవశాత్తు నదిలో మునిగిపోయేవాళ్లని కూడా కాపాడవచ్చని చెప్పారు. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అంటే కేవలము హెల్త్ క్లబ్ అని ఇక్కడ ఈతతో పాటు , బీచ్ వాలీబాల్ , షటిల్ బ్యాడ్మింటన్ , వాకింగ్ , సైక్లింగ్ మరియు ఓపెన్ జిమ్ వగైరా ఎక్సర్సైజ్ ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని సూచించారు. అధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు 5000 వేల మంది పిల్లలకు అసోసియేషన్ ద్వారా ఈత నేర్పించామని , పిల్లలకు ప్రతి రోజు శిక్షణ అనంతరము బూస్ట్ పాలు , గుడ్లు , బిస్కట్లు అందజేస్తామన్నారు. పేరెంట్స్ కొరకు యోగ మాస్టర్ ని పెట్టి వారి ఆరోగ్యము కోసము యోగా నేర్పిస్తామని వివరించారు. కార్యక్రమము లో అధ్యక్షులు లింగిపిల్లి రామకష్ణ , కార్యదర్శి వై.వి.రమేష్ కుమార్ , కోశాధికారి కె.వి.రామయ్య , కన్వీనర్ చెల్లారి జోజిబాబు , ఉపాధ్యక్షులు గోపాళం సాంబశివరావు , సహాయకార్యదర్శిలు అమ్మిరెడ్డి రామిరెడ్డి , గుండు జనార్ధనరావు , కె.యస్.రామచంద్రరావు , వై సుబ్బారావు, ఎమ్.నరసరాజు , వెంకటరెడ్డి , వి.రాము , సాంబయ్య కమిటి మరియు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపి గోకరాజు గంగరాజు